తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 141

మంగళవారం | అక్టోబర్ 22, 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## కుటుంబ పార్టీలను ఓడించాలి

- బిజెపి అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో కిషన్ రెడ్డి



హైదరాబాద్,అక్టోబర్21(అక్షరగళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కుటుంబ పార్టీలకు ప్రజలకు బుద్ధిచెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు ఒక్కటై రాజకీయాలు చేస్తున్నాయన్నారు. భాజపా అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో కేంద్రమంత్రి బండి సంజయ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావుతో కలిసి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు.

మిగతా.. 2లో





## పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా

- విధి నిర్వహణలోఎందరో పోలీసుల ప్రాణార్పణం
- అమరులను సంస్మరించుకోవడం మన విధి
- అమరుల కుటుంబానికి అన్ని విధాలుగా అండ
- నిజామాబాద్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం
- మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే
- ఈగిల్ టీమ్‌తో డ్రగ్స్ ముఠా అరికడుతున్నాం
- సైబర్ నేరాలపై పోలీసుల కృషి ప్రశంసనీయం
- పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భగా సీఎం రేవంత్ రెడ్డి నివాళి



హైదరాబాద్,అక్టోబర్21(అక్షరగళం): పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వచ్చినా పోలీస్ వెనుకడుగు వేయదని చెప్పారు. ఒకవైపు నెత్తురు చిందుతున్నా... మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ గోషామహల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన పోలీస్ అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులకు సీఎం నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించు కోవడం మనందరి కర్తవ్యమని సీఎం వ్యాఖ్యానించారు. ఆ బాధ్యతతోనే దేశవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 'అక్టోబరు 21'న

మిగతా.. 2లో

## జూబ్లీహిల్స్ ప్రచారం కోసం బిఆర్ఎస్ స్టార్ కాంపెయినర్లు

- 40మంది పేర్లు విడుదల చేసిన పార్టీ
- జాబితాలో మాజీ సీఎం కెసిఆర్ పేరు







హైదరాబాద్,అక్టోబర్ 21(అక్షరగళం): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారం కోసం భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీ తరపున మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆమోదం తెలిపింది. ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ సోమ భరత్ కుమార్ ఇచ్చిన ప్రతిపాదన మేరకు.. వారికి వాహనాల అనుమతికి పాస్‌లను మంజూరు చేశారు. ఈ ఎన్నికల ప్రచారం అక్టోబర్ 18 నుంచి నవంబర్ 9 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నది. బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయిన్ల జాబితాలో ముఖ్య నేతలు,

మిగతా.. 2లో



## వేడెక్కిన జూబ్లీహిల్స్ ప్రచారం

- దీపక్ రెడ్డికి మద్దతుగా కేంద్రమంత్రుల ప్రచారం
- జూబ్లీహిల్స్ కిషన్ రెడ్డి అడ్డా అన్న బండి సంజయ్

హైదరాబాద్,అక్టోబర్21(అక్షరగళం): జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కింది. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను విమర్శించారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. ఏయ్ బిడ్డా? జూబ్లిహిల్స్ కిషన్ రెడ్డి అడ్డా అంటూ

మిగతా.. 2లో



## ముగిసిన నామినేషన్ల పర్వం

- బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్
- కిషన్ రెడ్డి, రామచంద్రరావుతో కలసి వచ్చిన దీపక్

హైదరాబాద్,అక్టోబర్ 21(అక్షరగళం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత వెంకటగిరిలోని విజయ దుర్గ పోచమ్మ ఆలయంలో దీపక్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,

మిగతా.. 2లో



## పార్టీ ఫిరాయించి వచ్చినోడికి పార్టీలో ప్రాధాన్యత ఇస్తారా..?

మాజీ మంత్రి జీవన్ రెడ్డి మరోమారు ఆగ్రహం

జగిత్యాల,అక్టోబర్21(అక్షరగళం): పార్టీ ఫిరాయించి వచ్చినోడికి పార్టీలో ప్రాధాన్యత ఇస్తారా..? అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయించినోడికి ఇప్పటికీ సభ్యత్వం లేదంటూ పరోక్షంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం ఏంటో అర్థం కావడం లేదు.. పార్టీ ఫిరాయించి నోడు చెప్తేనే పనులు చేస్తున్నారని జీవన్ రెడ్డి అన్నారు. మొదటి నుంచి ఉన్న వారిని పట్టించుకోరా..? ఆవేదన చెందారు.మంత్రులు అడ్లూరి

మిగతా.. 2లో

## గెలిచిన వారు ఏ పార్టీలో ఉన్నారో?

- దానం నాగేందర్ స్టార్ కాంపెయినర్ ఎలా
- ఖైరతాబాద్ బస్తీ దవాఖానలను పరిశీలించిన కెటిఆర్
- ప్రభుత్వ వైద్యానికి సుస్తీ పట్టిందని విమర్శ



హైదరాబాద్, అక్టోబర్ 21(అక్షరగళం): పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేక పోతున్నారని.. వాళ్ళకి సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ దగ్గర తాము పార్టీ మారలేదని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినర్ల లిస్టులో

మిగతా.. 2లో



## ప్రమోద్ కుటుంబానికి అండగా ఉంటాం

- బాధిత కుటుంబానికి డిజిపి పరామర్శ
- అంకితభావంతో పనిచేసే పోలీసును కోల్పోయాం
- రియాజ్ ఎన్‌కౌంటర్‌పై విచారణ
- ఆస్పత్రిలో గాయపడ్డ ఆసిఫ్‌కు పరామర్శ

నిజామాబాద్,అక్టోబర్21(అక్షరగళం): ఇటీవల విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని కానిస్టేబుల్ ఇంటికి వచ్చిన డీజీపీ, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పలువురు ఉన్నతాధికారులు.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఒక

మిగతా.. 2లో



## బిల్లుల కోసం సచివాలయం ముందు ధర్నాలు

- ధర్నా చౌక్‌గా మారిన సచివాలయం
- చిన్న కాంట్రాక్టర్లకు చెల్లింపుల్లో నిర్లక్ష్యం
- ప్రజారోగ్యం విస్మరించి.. బస్తీదవాఖానలపై నిర్లక్ష్యం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



హైదరాబాద్,అక్టోబర్ 21(అక్షరగళం): పరిపాలన కేంద్రంగా ఉండాల్సిన సచివాలయం కాంగ్రెస్ పాలనలో ధర్నాచౌక్‌లా మారిందని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మొన్న చిన్న కాంట్రాక్టర్లు సచివాలయం లోపల ధర్నా చేస్తే.. బిల్లులు చెల్లించాలంటూ ప్రభుత్వ అద్దె వాహన యజమానులు సచివాలయం ఎదుట ఆందోళన చేసిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ,

మిగతా.. 2లో



## అడ్డూ అదుపులేని బంగారం ధరలు



- తులం ధర మరో మూడువేలు పెరుగుదల

హైదరాబాద్,అక్టోబర్21(అక్షరగళం):దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. క్రితం రోజుతో పోలిస్తే పసిడి ధర మంగలశారం దాదాపు రూ.3వేలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పుత్తడి ధర రూ.1.34 లక్షలు దాటింది. అటు వెండి ధర కూడా కేజీపై దాదాపు

మిగతా.. 2లో

## తొలి మహిళా ప్రధానిగా సనే తకైచి

- ఎన్నుకున్న జపాన్ పార్లమెంట్




టోక్యో,అక్టోబర్21(అక్షరగళం): జపాన్ తొలి మహిళా ప్రధానిగా అతివాద నేతగా పేరున్న సనే తకైచి ఎన్నికయ్యారు. జపాన్ పార్లమెంట్ మంగళవారం దేశంలోని తొలి మహిళా ప్రధాన మంత్రిగా సనే తకైచికి ఎన్నుకుంది. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి

మిగతా.. 2లో

# వేడెక్కిన జూబ్లీహిల్స్ ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించిన ఆయన.. కిషన్ రెడ్డి నాయకత్వంలో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే అని ఆయన విమర్శించారు. ఈ రెండు పార్టీలు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని ఆయన ఆరోపించారు.. ఈ రెండు పార్టీల పాలనలో జూబ్లీహిల్స్ ప్రజలకు ఒరిగిందేమిటి? అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలపై దాడులు జరిగినా పోలీసులు పట్టించుకోవడం లేదని, అయితే హరీష్ రావు చెప్పగానే ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయన్నారు. అసదుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్‌కు మద్దతిస్తే, ఆయన తమ్ముడు బీఆర్ఎస్‌కు వత్తాసు పలుకుతున్నారని, బీజేపీని ఓడించడమే మజ్లిస్ పార్టీ ప్రధాన లక్ష్యమని సంజయ్



వ్యాఖ్యానించారు. జూబ్లిహిల్స్‌లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయడం లేదు? ఈ రెండు పార్టీలతో చేసుకున్న బేరసారాలే నిదర్శనం అని ఆయన అన్నారు. బీజేపీ గెలిస్తేనే కేంద్ర నిధులతో జూబ్లిహిల్స్ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కిషన్ రెడ్డి మరిన్ని నిధులు తెచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తారు. కానీ కాంగ్రెస్ గెలిస్తే బంజారాహిల్స్ పెద్దమ్మతల్లి స్థలాన్ని మజ్లిస్‌కు ధారాదత్తం చేసేలా ఒప్పందాలు కుదుర్చుకుంటారని సంజయ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌పై కోపంతో బీఆర్ఎస్‌కు ఓటేయడం అంటే రెండు పార్టీలకీ బలమిచ్చినట్లేనని అన్నారు. బీజేపీని గెలిపించండి? ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, బీజేపీ చీఫ్ రామచందర్ రావు, గౌతమ్ రావు, పాయల్ శంకర్ తదితర నేతలు హాజరయ్యారు.

## ముగిసిన నామినేషన్ల పర్వం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా షేక్‌పేట తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు.

2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్లకు చివరి రోజు కావడంతో అతను నామినేషన్ వేశారు.. మంగళవారం సాయంత్రంతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నామినేషన్ల గడువు ముగిసింది. ఉప ఎన్నికల్లో పోటీకి చివరిరోజులు పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 150కిపైగా నామినేషన్లు దాఖలవగా.. అభ్యర్థుల సంఖ్య 100 మార్క్‌ని దాటింది. మూడు గంటల తర్వాత గేటు లోపల ఉన్న వారికి మాత్రమే అధికారులు నామినేషన్లు వేసేందుకు అవకాశం కల్పించారు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు భారీగా నామినేషన్స్ వేశారు.

ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు, ఓయూ నిరుద్యోగ వికాస నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల చివరిరోజున బీజేపీ తరఫున లంకల దీపక్‌రెడ్డి సైతం ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ తరఫున నవీన్ యాదవ్ నామినేషన్లు వేశారు. రేపటి నుంచి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి సాయిరాం పరిశీలించనున్నారు. ఇక 24న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగనుండగా.. 14న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు.

# బిల్లుల కోసం సచివాలయం ముందు ధర్నాలు

(మొదటి పేజీ తరువాయి)

అసమర్థ పాలనకు నిదర్శనమిదీ అని అన్నారు. కమిషన్ల కోసం బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. చిన్న కాంట్రాక్టర్లు, చిరు ఉద్యోగులకు చెల్లించాల్సిన బిల్లులు, జీతాలు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం శోచనీయమని హరీశ్‌రావు విమర్శించారు. వాహన అద్దె బిల్లులు హైదరాబాద్‌లో 10 నెలలుగా, జిల్లాల్లో 2 సంవత్సరాలుగా పెండింగ్‌లో పెట్టడం అన్యాయమని అన్నారు. కమిషన్లు ఇవ్వడం లేదని అద్దె వాహనాల బిల్లులు చెల్లించడం లేదా అని నిలదీశారు. యజ మానుల కష్టాలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే అదె వాహనాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇదిలావుంటే కేసీఆర్‌పై కోపంతో కేసీఆర్ కిట్‌లు తీసేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పేదల ఆరోగ్యంపై రేవంత్‌కు శ్రద్ధ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టిందని మండిపడ్డారు. శేరిలింగంపల్లిలో బస్తీ దవాఖానను హరీశ్ రావు పరిశీలించారు. ఈ సంద ర్భంగా దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. ఏఏ మందులు అందుబాటులో ఉన్నాయి, వైద్య పరికరాలు పనితీరు, వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జీతాలు



అందుతున్నాయా అని సిబ్బందిని అడగడంతో.. నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని తమ కష్టాలను హరీశ్ రావుతో చెప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ బస్తీ దవాఖానలను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు ఇవ్వడం లేదని చెప్పారు.

గ్రీన్ చానల్ మాటలకేపరిమితమయిందని విమర్శించారు. ఈహెచ్ఎస్ కింద బకాయిలు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. బిల్లులను పెండింగ్ పెట్టడంతో ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. బస్తీ ప్రజలకు తమ గడప దగ్గరే వైద్యం అందించాలనే ఉద్దేశంతో.. నాడు కేసీఆర్ గారు రాష్ట్రం మొత్తంలో 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. వాటిలో 110 రకాల మందులను, 134 రకాల టెస్టులను ఉచితంగా చేసేవారు. కానీ 22 నెలల కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానాలకే సుస్తీ పట్టుకున్నది. లింగంపల్లిలో ఉన్న బస్తీ దవాఖానా సిబ్బంది తమకు 5-6 నెలల నుండి జీతాలు రావడం లేదని బాధపడుతున్నారు. నిత్యావసరమైన మందులు కూడా అందుబాటులో లేవు. రేవంత్ ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది ఒకటి. సీఎం రేవంత్ రెడ్డి కొత్త వైన్ షాపుల అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాదని విమర్శించారు. దరఖాస్తులు తక్కువ వచ్చాయని వారం రోజులు గడువు పెంచిందని మండిపడ్డారు. మద్యం దుకాణాల మీద, ఆదాయం మీద ధ్యాస తప్ప ప్రజల ఆరోగ్యం శ్రద్ద లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్ ఎందుకు రావడం లేదని, బస్తీ దవాఖానలో మందులు ఎందుకు లేవని నిలదీశారు. బస్తీ దవాఖానల సిబ్బందికి జీతాలు ఎందుకు వస్తలేవన్నారు. ఒక్కరోజైనా రివ్యూ చేశావా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. మద్యం దుకాణాల గురించి తప్ప గరీబ్ వాళ్ల గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చినంక నల్లా నీళ్ళకు బిల్లులు వేసి పైసలు కట్టాలి అంటున్నరు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టాలె. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తేనే బస్తీ దవాఖానాలు బాగుపడతాయి.

# ప్రమోద్ కుటుంబానికి అండగా ఉంటాం..

(మొదటి పేజీ తరువాయి)

మంచి కానిస్టేబుల్‌ను కోల్పోయామన్నారు. ఇది పోలీస్ శాఖను తీవ్రకలవరానికి గురి చేసిందన్నారు. రియాజ్ ఎన్‌కౌంటర్ ఘటనపై విచారణ జరుగుతోంది. విచారణ జరుగుతున్నప్పుడు కేసు గురించి మాట్లాడితే దర్యాప్తు అధికారిని ప్రభావితం చేసినట్లు అవుతుంది. ప్రమోద్ కుటుంబానికి రూ.కోటి పరిహారం, సెప్టెంబరు నెల వేతనం ఎంత తీసుకున్నారో ఆ మొత్తాన్ని పదవీ విరమణ తేదీ వరకు ప్రతినెలా ఆయన కుటుంబానికి అందించాలని, 300 గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పోలీసు భద్రత, వెల్ఫేర్ బోర్డుల నుంచి రూ.24 లక్షల పరిహారం, పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. నిజామాబాద్‌లో ఇటీవల చోటుచేసుకున్న సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ హత్య కేసులో ప్రధాన నిందితుడు రౌడీషీటర్ రియాజ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా, అతన్ని పట్టుకునే క్రమంలో మరొక యువకుడు ఆసిఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆసిఫ్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉండగా, ఆయన సాహసాన్ని ప్రశంసిస్తూ రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మంగళవారం నాంపల్లిలోని మల్లారెడ్డి ఆసుపత్రిలో ఆయనను పరామర్శించారు.

ఆసుపత్రిలో ఆసిఫ్‌ను కలసిన డీజీపీ శివధర్‌రెడ్డి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యుల నుండి ఆరా తీశారు. డాక్టర్లు వివరించిన ప్రకారం ఆసిఫ్‌పై సర్జరీ పూర్తయిందని, ప్రస్తుతం ఆయన చేతి నరాలను సవ్యంగా కలిపి సాధారణ స్థితికి తీసుకురావడానికి చికిత్స కొనసాగుతున్నదని తెలిపారు. ఆసిఫ్ పరిస్థితి స్థిరంగా ఉందని డీజీపీ వెల్లడించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డీజీపీ శివధర్‌రెడ్డి, ఆసిఫ్ చాలా ధైర్యంగా, నిజమైన పోలీసు స్ఫూర్తితో వ్యవహరించాడు. నిందితుడిని పట్టుకునే ప్రయత్నంలో ఆయన చూపిన సాహసం ప్రశంసనీయం. ఆయన వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుంది. అంతేకాదు, ఆసిఫ్ ధైర్యాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి గ్యాలంట్రీ మెడల్ కోసం సిఫార్సు చేస్తామని తెలిపారు. నిందితుడు రియాజ్ చేసిన దాడిలో ఆసిఫ్ రెండు చేతులకు లోతైన కత్తిగాట్లు అయ్యాయి. చేతి నరాలు కోసుకు పోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. మొదట స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం ఆయనను హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం మల్లారెడ్డి ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. డాక్టర్లు ఆసిఫ్‌పై సర్జరీ విజయవంతంగా పూర్తయిందని, కొద్ది వారాల్లో ఆయన కోలుకుంటారని తెలిపారు.

గత వారం జరిగిన ఈ ఘటనలో రౌడీషీటర్ రియాజ్‌ను నిజామాబాద్ పోలీసులు అక్టోబర్ 17న అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ సమయంలో అతను సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌పై కత్తితో దాడి చేసి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్ర గాయాల కారణంగా కానిస్టేబుల్ ప్రమోద్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర పోలీస్ శాఖ, నిందితుడిని పట్టుకునేందుకు పెద్ద ఎత్తున దాడులు చేపట్టింది. చివరికి రియాజ్‌ను పట్టుకునే క్రమంలో ఆసిఫ్ ధైర్యంగా ఎదుర్కొని తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం రియాజ్‌ను పట్టుకొని ఆసుపత్రికి తరలించారు.

అయితే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో రియాజ్ మరోసారి పోలీసులపై దాడికి పాల్పడి ఆయుధాలు లాక్కునేందుకు యత్నించాడు. ఆత్మరక్షణార్థం పోలీసులు జరిపిన కాల్పుల్లో రియాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన తర్వాత పోలీస్ శాఖలో ఆసిఫ్ సాహసానికి అభినందనలు వెల్లు వెత్తుతున్నాయి. ఒక సాధారణ వ్యక్తి అయినా పోలీసుల మాదిరిగా ప్రమాదంలో పాల్గొని నిందితుడిని పట్టుకునేందుకు సాహసం చేసినందుకు ఆయనను రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసిస్తున్నారు. డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నట్లుగా, ఆసిఫ్ సాహసాన్ని గుర్తించి గ్యాలంట్రీ అవార్డుకు సిఫార్సు చేయడం ద్వారా ఆయనకు తగిన గౌరవం అందించనున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టులు లొంగిపోవాలని ఇప్పటికే సీఎం సూచించారు. తెలంగాణ నుంచి ఇంకా దాదాపు 65 మంది మావోయిస్టులు యాక్టివ్‌గా ఉన్నారు. వారిపై ఉన్న కేసుల విషయంలో సానుభూతితోనే వ్యవహరిస్తాం, ఎలాంటి వేధింపులు ఉండవని డీజీపీ తెలిపారు.

# పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం'గా ఘనంగా నిర్వహించు కుంటున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తు న్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.విధి నిర్వహణలో వీర మరణం పొందిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి.. తొలి ప్రతిని డీజీపీ శివధర్‌కు అందిం చారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇటీవల చనిపోయిన ప్రమోద్ కుటుంబానికి అన్ని విధాలుగా సాయం చేస్తాం. పోలీసు అమరవీరుల కుటుం బాలకు ఇంటిస్థలం కేటాయి స్తున్నాం. పలు విభాగాల్లో మన పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై పోరాడేందుకు ఈగల్ పేరుతో బృందాలను నియమించాం. ఇటీవల అనేక మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని మిగతా మావోయి స్టులనూ కోరుతున్నానని సీఎం తెలిపారు.

ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 191 మంది పోలీస్ సిబ్బంది, తెలంగాణ రాష్ట్రంలో ఆరుగురు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు.గ్రేహౌండ్స్ కమాండోలు టి.సందీప్, వి.శ్రీధర్, ఎన్.పవన్ కళ్యాణ్‌లు సంఘవిద్రోహ శక్తులతో పోరా డుతూ వీరమరణం పొందారని చెప్పారు. అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్లాల్, నల్గొండ కాని స్టేబుల్ బి.సైదులు విధినిర్వహణలో మరణించారని అన్నారు.మూడు రోజుల కింద నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం చెందారని గుర్తుచేశారు.

భర్త ప్రమోద్‌ను పోగొట్టుకున్న అతని భార్య ప్రణీతకు, అతి చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన అతని ముగ్గురు కుమా రులకు, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఒక కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా, అమరుడైన కాని స్టేబుల్ పదవీ విరమణ వరకు లాస్ట్ పే డ్రాన్ సాలరీతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వీటితోపాటు పోలీస్ భద్రత సంక్షేమం నుండి రూ.16 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ వెల్ఫేర్ నుండి రూ.8 లక్షలు ఎక్స్ గ్రేషియాను ప్రమోద్ కుటుంబానికి చెల్లించి వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. 29.06. 2008న ఒరిస్సాలో మావోయిస్టుల దాడిలో మరణిం చిన 33 మంది పోలీస్ కుటుంబాలకు గాజుల రామారంలో 200 గజాల స్థలం కేటాయించామన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ అవలంబిస్తున్న విధానాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం మా ప్రభుత్వానికి గర్వకారణమని పేర్కొన్నారు.

దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు ప్రథమ స్థానం లభిం చిందని తెలిపారు. అదేవిధంగా, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విధానంలోనూ విదేశాంగ శాఖ నుంచి ప్రత్యేక అభినందనలు పొందిందని చెప్పారు. ఈ విజయాలు తెలంగాణ పోలీస్ సిబ్బంది నిరంతర కృషి,అంకితభావానికి నిదర్శనమని చెప్పారు. ఇలాగే, ప్రజల భద్రత, శాంతిని కాపాడుతూ, తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. తీవ్రవాదం, ఉగ్రవాదం, సంఘ విద్రోహ కార్యకలా పాలు, మతతత్వ ఆందోళనలు, వైట్ కాలర్ నేరాలు, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, కల్తీ ఆహారాలు, గుట్కాలు, మట్కాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు రాష్ట్రంలో పెరగనివ్వకుండా అహర్నిశలు శ్రమిస్తూ తెలంగాణ పోలీసులు దేశానికే ఆదర్శంగా నిలిచారు. నేరం చేసి తప్పించుకోలేమన్న పరిస్థితిని సృష్టించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పెంచిన తెలం గాణ పోలీస్ శాఖను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. తెలంగాణలో డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్' వింగ్ సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వర్తిస్తుంది. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలి అనేది మా ప్రభుత్వ సంకల్పం అని అన్నారు. డ్రగ్స్ దందా వెనక ఎంతటి వారున్నా వదిలిపెట్టొద్దు అనే ఆదేశాలను జారీ చేశాం. ఒకప్పటితో పోలిస్తే నేరాల స్వభావం మారుతోంది.

సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలు, మార్ఫింగ్ కంటెంట్, డ్రగ్స్, హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి కొత్త తరహా నేరాలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి.మానవ నేరాలను మించి సైబర్ క్రైమ్ వార్తలు పత్రికల్లో ఎక్కువ కనిపిస్తున్నాయి. టెక్నాలజీ రూపంలో ఎదురవుతున్న సవాళ్లకు టెక్నాలజీతోనే తెలంగాణ పోలీసులు సమాధానం చెబుతున్న తీరు భేష్.. సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు డీజీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ బ్యూరో'ను ఏర్పాటు చేశాం.ఈ విభాగం అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ దేశంలో ది బెస్ట్ గా నిలిచింది.సైబర్ నేరగాళ్ళను అరికట్టడానికి అంతర్ రాష్ట్ర ఆపరేషన్లు సైతం నిర్వహిస్తున్న తెలంగాణ పోలీసులకు యావత్ దేశం సెల్యూట్ చేస్తోందని అన్నారు. తీవ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాలు గతంలో రాష్ట్రంలో విస్తృతంగా జరిగేవి.కానీ నేడు పోలీస్ శాఖ చర్యల వల్ల శాంతి నెలకొంది.మావోయిస్టు ఉద్యమంలో ఉన్న అజ్ఞాత నాయకులను జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.ఇటీవల కొందరు మావోయిస్టు కీలక నాయకులు లొంగిపోయిన విషయం మీ అందరికీ తెలుసన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసిపోయి దేశాభివృద్ధిలో భాగ స్వాములు కావాలని సూచించారు. పోలీసు శాఖలోని పలు కీలక విభాగాల్లో అర్హత కలిగిన మహిళా ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబీ, ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సీసీఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపీఎస్‌ల సారథ్యం వహించడం మా ప్రభుత్వానికి గర్వకారణం. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డీసీపీలుగా ఏడుగురు మహిళా అధికారులే. రెండేసి కీలక విభాగాలను సైతం సమర్థవంతంగా నడిపిస్తున్న మహిళా ఐపీఎస్ అధికారులను చూసి తెలంగాణ గర్విస్తోందన్నారు. సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన లేదా గాయపడి, అంగ వైకల్యం పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి, దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అత్యధిక నష్టపరిహారం అందించాం.

# కుటుంబ పార్టీలను ఓడించాలి

(మొదటి పేజీ తరువాయి)

మజ్లిస్ పార్టీ దోపిడీ, దౌర్జన్యాల కారణంగా నగరంలో ఎలాంటి పరిస్థితి ఉందో అందరికీ తెలుసు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి పక్కన మజ్లిస్ చేరి ప్రజలపై పెత్తనం చేస్తోంది. అందుకే ఆ మూడు పార్టీలకు ప్రజలకు బుద్ధి చెప్పాల్సిన అవసరముంది. భాజపా అభ్యర్థి దీపక్‌రెడ్డిని గెలిపించాలని కిషన్‌రెడ్డి కోరారు. జూబ్లీహిల్స్ అంటే ఎంతో అభివృద్ధి చెందిన, ధనవంతులు ఉండే ప్రాంతం అనుకుంటాం. రోడ్లు బాగుంటాయని భావిస్తాం. కానీ.. ఎక్కడ చూసినా చెత్త, మురుగునీరు ఉంటోంది. సరైన రోడ్లు, వీధి లైట్లు ఉండవు. హైదరాబాద్‌ను లండన్, వాషింగ్టన్, సింగపూర్ చేస్తానని చెప్పిన వ్యక్తి ఇప్పుడు ఫాంహౌస్‌లో ఉన్నారు. ఇక్కడి ప్రజలకు మాత్రం డ్రైనేజీ సమస్యలు, ఇతర ఇబ్బందులు మిగిలాయి. జాబ్ క్యాలెండర్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఉద్యోగాలు ఎక్కడ? కాంగ్రెస్ అభ్యర్థిని మజ్లిస్ కార్యాలయం దారుస్సలాంలో నిర్ణయించారు. కాంగ్రెస్ అభ్యర్థి మజ్లిస్ నేతల ఆశీస్సులు తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంత దారుణంగా వ్యవహరిస్తోంది.

## జూబ్లీహిల్స్ ప్రచారం కోసం బిఆర్ఎస్ స్టార్ కాంపెయినర్లు

(మొదటి పేజీ తరువాయి)

మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు ఉన్నారు. ఈ జాబితాలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పేరు సైతం ఉన్నది. అలాగే, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, టీ శ్రీనివాస్ యాదవ్, వీ ప్రశాంత్ రెడ్డి, జీ జగదీశ్ రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఎస్ నిరంజన్ రెడ్డి ఉన్నారు. మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, వీ శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్ సైతం స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్లు టీ పద్మారావు గౌడ్, పద్మా దేవేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు ఎం కృష్ణ రావు, కేపీ వివేకానంద గౌడ్, డీ సుధీర్ రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, కాలేరు వెంకటేశం, పాడి కౌశిక్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అనిల్ జాదవ్, బండారు లక్ష్మా రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, చింతా ప్రభాకర్ సైతం స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారు. ఎమ్మెల్సీల్లో దాసోజు శ్రవణ్, ముఠా గోపాల్, శంబీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, టాటా మధుసూధన్, ఎల్ రమణా, తక్కెలపల్లి రవీందర్ రావు ఉన్నారు. ఎంపీ వద్దిరాజు రవి చంద్ర, మాజీ ఎమ్మెల్యేలు విష్ణు వర్ధన్ రెడ్డి, షకీల్ అమీర్ మొహమ్మద్, మాజీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, షేక్ అబ్దుల్లా సోహైల్ పేర్లు సైతం ఉన్నాయి.

# తొలి మహిళా ప్రధానిగా సనే తకైచి

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార పార్టీ మెజార్టీని సాధించలేకపోయింది. దీనికి ముందు దిగువ సభలో కూడా మెజార్టీ కోల్పోయింది. దీంతో ఇషిబాపై ఒత్తిడి పెరగ్గా.. ఆయన తన పదవికి రాజీ నామా చేశారు. ఈక్రమంలోనే శనివారం పార్టీలో ఎన్నికలు జరగ్గా.. మాజీ ప్రధాని కుమా రుడు షింజిరో కోయిజుమితో పాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి తకైచి విజయం సాధించారు. పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ- జపాన్ ఇన్నోవేషన్ పార్టీ కూటమితో.. తకైచికి భారీ మద్దతు లభించింది. దీంతో జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించారు. 64 ఏళ్ల తకైచి 1993లో స్వస్థలమైన నారా నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎల్‌డీపీలో ఆర్థిక భద్రత, అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రితో సహా పలు కీలక పదవుల్లో పనిచేశారు. జపాన్ తొలి మహిళా ప్రధాని ఎన్నికైన సానే తకైచికి ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. భారత్-జపాన్‌ల ప్రత్యేక వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తకైచితో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుల విషయంలో ఇరుదేశాల బంధాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

# గెలిచిన వారు ఏ పార్టీలో ఉన్నారో?

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దానం నాగేందర్ ఏ పార్టీలో గెలిచారు, ఏ పార్టీకి ప్రచారం చేస్తున్నాడని నిలదీశారు. ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీలో గెలిచిన వాళ్లను తీసుకుని, వాళ్ల పార్టీ క్యాంపెయినర్ల జాబితాలో పెట్టారని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ హైదరాబాద్‌ను గాలికొదిలేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బస్తీ దవాఖానలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హైదరా బాద్‌ను రేవంత్ గాలికి వదిలేశారని చెప్పారు. ప్రజల ఆరోగ్యం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఖైరతాబాద్‌లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాని సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. మందులు, పరికరాల పని తీరు, దవాఖానలో అందుతున్న వైద్య సేవల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ నలువైపులా నాలుగు టిమ్స్ దవాఖానలను ప్రారంభించిందని చెప్పారు. 90 శాతం పనులు బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 10 శాతం పనులు చేయడానికి ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని మండిపడ్డారు. బస్తీ దవాఖానలను రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా తమకు 4 నెలలుగా జీతాలు రావడం లేదని, జీతాల విషయంలో ప్రభుత్వం ఇబ్బందులు పెడుతుందని మహిళా డాక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలపై ఆరా తీశారు. చిన్నారులకు చాకెట్లు పంపిణీ చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నాడు కేసీఆర్ హయాంలో ప్రజలకు, ముఖ్యంగా పేదలు అందరికీ అందుబాటులో ఉండేలా 450 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారని తెలిపారు. వాటితో పాటు తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్‌లను ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా పరీక్షలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బస్తీ దవాఖానాలను నిర్లక్ష్యం చేసి, ప్రజారోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించారు. నాలుగు ఐదు నెలలుగా బస్తీ దవాఖానాలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. బస్తీ దవాఖానల్లో మందు గోళీలు కూడా అందుబాటులో లేవన్నారు. ప్రజారోగ్యం అంటే రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉన్నదో దీనితో అర్థమవుతుందన్నారు.

# అడ్డూ అదుపులేని బంగారం ధరలు

(మొదటి పేజీ తరువాయి)

రూ.4వేలు పెరగడం గమనార్హం. హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర (24 క్యారెట్లు) రూ.1,31,600 పలికింది. మంగళవారం ఆ మొత్తం రూ.1,34,500కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,21,000గా ఉంది. మరోవైపు కిలో వెండిధర సోమవారం రూ.1,67,300 పలికింది. నేడు ఆ ధర రూ.1,71,200కు పెరిగింది. గతవారం రూ.1.85 లక్షల వరకు ఎగబాకిన వెండి ధర ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు మళ్లీ గిరాకీ పెరగడంతో బంగారం, వెండి ధరలు మరోసారి పరుగులు పెడుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,335 డాలర్లు పలుకుతోంది. ఔన్సు వెండి ధర 51 డాలర్ల పైనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి, రష్యా ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా టారిఫ్‌లు, డాలర్ విలువ తగ్గిపోతుండటం వంటి పరిణామాలతో పసిడిలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గుచూపుతున్నారు. ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్)లలో, కమొడిటీస్ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్‌పై పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఇక, పలు దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తుండటం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు, రాబోయేది పెళ్లిళ్ల సీజన్. దీంతో బంగారం ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## పార్టీ ఫిరాయించి వచ్చినోడికి పార్టీలో ప్రాధాన్యత ఇస్తారా..?

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్మణ్ కుమార్, శ్రీధర్ బాబు తన మానసిక క్షోభకు కారణమని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నన్ను మేకలా బలిచ్చారని వ్యాఖ్యానించారు. తనకు ఏ పదవులు అవసరం లేదని.. ఇక నుంచి కార్యకర్తలను కాపాడుకోవడమే తన పని అని అన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న వారిని పట్టించుకోరా అని ప్రశ్నించారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి ప్రయారిటీ ఇస్తూ, మొదటి నుంచి ఉన్న వారిని నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నేరుగా ఫిర్యాదు చేయడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సంజయ్‌కి.. పదేళ్లు దోచుకున్న అనుభవం ఉందని ఆయన మాటలే వింటారా..?' అంటూ ఫైర్ అయ్యారు. తాము వలసదారులం కాదంటూ తాజాగా పార్టీలోకి చేరి పదవులనుభవిస్తున్న వారిపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి చురకలు అంటించారు. మంత్రి శ్రీధర్‌బాబు, అడ్లూరి అడ్డుకోకపోతే ఆ రోజే కథ వేరుండేదంటూ అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో మేం కౌలు దారులం కాదు.. పట్టాదారులమంటూ వ్యాఖ్యానించారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా కింద పోరాడుతున్నానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. పార్టీలో నిజమైన కార్యకర్తలను పక్కనపెట్టి బీఆర్ఎస్ నాయకులకు బీర్పూర్ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కమిటీల్లో పదవులు ఇస్తున్నారని విమర్శించారు. పెంబట్ల దేవాలయం తప్ప, మిగతా అన్ని కమిటీలు బీఆర్ఎస్ నేతల చేతుల్లోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాస పౌలస్తేశ్వర స్వామి ఆలయ కమిటీలో సైతం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అనుచరు లకు స్థానం కల్పించారని ఆరోపించారు.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com

అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్

## ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21, (అక్షర గళం):** బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ జన్మదినం సందర్భంగా మంగళవారం జీడిమెట్లలోని వారి నివాసంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డితో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు ఎమ్మెల్యేను మార్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## లక్ష్మీ కటాక్షం అందరిపై ఉండాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):** అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా లక్ష్మీదేవి కటాక్షం ఉండాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దీపావళి వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేలా అమ్మవారి అనుగ్రహం ఉండాలన్నారు.

## మెడిసిన్ విద్యార్థినికి సన్మానం

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):** ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన పెరికేటి సుజాత యాదయ్య దంపతుల కుమార్తె సాయిదీపిక మహబూబ్ నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా మంగళవారం నాయి బ్రాహ్మణ



సేవా సంఘం అధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. స్వీటు తినిపించి, వినాయకుడి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కానుగుల దశరథం మాట్లాడుతూ.. చిన్నప్పటి నుండి చదువులలో చురుకుగా ఉంటూ అన్ని స్థాయిలో పరీక్షలో రాణించినందుకు ఆమె ప్రతిభను దశరథం కొనియాడారు. తల్లితండ్రులు పెరికేటి సుజాత యాదయ్య అభినందించి కులవృత్తిపై ఆధారపడి పిల్లలను చదివించడం ఆదర్శనీయమని తెలిపారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆమనగల్లు మండల అధ్యక్షుడు కానుగుల గణేష్, పట్టణ అధ్యక్షుడు దేవరకొండ రమేష్, ప్రధాన కార్యదర్శి గుద్దేటి బాలు, దేవరకొండ నాగేష్, పెరికోటి కోటీ తదితరులు కుటుంబ సభ్యులు ఉన్నారు.

## విద్యతోనే జీవితంలో ఉన్నతి

**- పల్లె రాజు గౌడ్**

**ఆమనగల్లు, అక్టోబర్ 21 అక్షర గళం):** విద్యతోనే జీవితంలో ఉన్నతి సాధించగలమని యువ నాయకుడు పల్లె రాజు గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన పుట్టినరోజు



సందర్భంగా పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినీలకు పాఠ్య పుస్త కాలు, పరీక్ష ప్యాడ్స్, వాటర్ బాటిల్స్ విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికా యుతంగా చదువుకోవాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రుల, గురుకుల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. సమా జంలో ఆదర్శ ప్రాయులుగా నిలవాలని కోరారు. విద్యార్థులు,గురువులను గౌరవించాలని, తల్లిదండ్రుల పట్ల ప్రేమ భావాలను కలిగి ఉండాలని అటువంటప్పుడు మాత్రమే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యను అభ్యసించేటప్పుడు పూర్తి ఏకాగ్రతతో అభ్యసించాల న్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి జీవితాన్ని నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో సైదులు, సాయి, లోకేష్, భారత్, మల్లేష్, జహంగీర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలో సమస్యలను పరిష్కరించండి

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):**

మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు విద్యా కాలనీలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులను చేపట్టాలని కాలనీ యూత్ అధ్యక్షుడు ఉదయ్ కిరణ్ మంగళవారం కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కృష్ణ త్రాగు నీటి వసతి, విద్యుత్ దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారని వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీ లేక పందులు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. విద్యుత్ దీపాలు లేక ఇళ్లల్లోకి పాములు వస్తున్నాయని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా పనులను చేపట్టాలని ఉదయ్ కిరణ్ కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ శంకర్ నాయక్ త్వరలోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ దీపాల సమస్యలను పరిష్కరిస్తా అని హామీ ఇచ్చారు. వినతి అందజేసిన వారిలో కాలనీవాసులు వర్కాల వంశీ, మాదుగుల అరుణ్, చత్రపతి తదితరులు ఉన్నారు.



## ఆకాశాన్నంటిన వెలుగులు


**- ఇంటింటా దీపావళి సంబరాలు**

**- భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి పూజ**

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):**

దీపావళి పండుగను సోమ, మంగళవారాల్లో పట్టణ వాసులు ఘనంగా జరుపుకొన్నారు. భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. వాణిజ్య, వ్యాపార దుకాణాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. వ్యాపారవేత్తలు పాత ఖాతాలు మూసేసి కొత్త పుస్తకాలు తెరిచారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సమేతంగా దుకాణాల్లో లక్ష్మీపూజ నిర్వహించారు. పండుగ సందర్భంగా కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల్లో ప్రజలు కొనుగోలు సందడి కనిపించింది. మార్కెట్లో బంతిపూలకు డిమాండు ఉండటంతో కొన్నిచోట్ల రెట్టింపు ధరతో విక్రయించారు. అలాగే ఇంటిల్లిపాది ఇంట్లో వివిధ ఆకృతుల దీపాలను పూలతో అందంగా అలంకరించారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టారు.

ఇంట్లో లక్ష్మీదేవి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీదేవిని సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించే విధంగా మహిళలు ఇంటి ముందు రంగరంగుల ముగ్గులు వేశారు. ఇలా చీకటిని చీల్చి వెలుగునిచ్చే ఈ పండుగను కుటుంబ సభ్యులు ఎంతో ఆనందంగా జరుపుకొన్నారు. బంధువులు, మిత్రులను ఇంటికి ఆహ్వానించి వారికి తీపి పదార్థాలు అందించారు. సోమవారం నాటి అర్ధరాత్రి వరకు టపాసుల పేలుళ్లు, వతాబుల మురిపాలు, చిచ్చుబుడ్లు, భూచక్రాల సంప్రదాయం శబ్ద కాంతుల పరవశంలో ఆమనగల్లు ప్రజానీకం మునిగింది. దీంతోపాటుగా ఇటీవల మరింత ఆధునిక రీతుల్లో రూపొందించిన బాణసంచాను కాల్చుతూ చిన్నా, పెద్దా సంబరాలు చేసుకున్నారు.






## రక్తదానం చేయడంతో వేలాదిమంది ప్రాణాల్ని నిలుపుతుంది

**- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప**

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21, (అక్షర గళం):** రక్తదానం చేయడం తో వేలాదిమంది ప్రాణాల్ని నిలుపుతుందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అన్నారు. మంగళవారం నిమ్స్ ఆసుపత్రిలో అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్‌తో కలిసి జీడిమెట్ల ఠాణా ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్‌ను సన్మానించారు.

పోలీసులు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జీడిమెట్ల ఠాణాలో మహా రక్తదానం ఏర్పాటు చేయగా.. 412 మంది స్థాని కులు పాల్గొని రక్తదానం చేశారు. ఇందులో 146 మంది నిమ్స్ బ్లడ్ బ్యాంకుకు రక్తాన్ని దానం చేశారు.

శాంతిభద్రతల పరి రక్షణలో నిర్విరామంగా సేవలందిస్తోన్న నగర పోలీసులు మహా రక్తదానంతో వేలాదిమంది ప్రాణాలకు రక్షకులయ్యారని కొని యాడారు. నేటి యువతకు స్ఫూర్తినిచ్చేలా ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని డైరెక్టర్ అభినందించారు.

ప్రస్తుతం అత్యవసర కేసులు, అవయవ మార్పిడీ సమయంలో రక్తం కొరత ఇబ్బందిగా మారుతోం దన్నారు. జీడిమెట్ల పోలీసులు స్ఫూర్తితో యువత రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు చాలామంది భయపడుతుంటారని.. ఒక్కసారి చేస్తే దాని విలువ తెలిసి ప్రతీసారి నిలబడేందుకు చాలా మంది ముందుకొస్తుంటారన్నారు. ఆ భయాన్ని పోగొట్టేందుకు, రక్తదానం విలువ చెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహించా మన్నారు. 412 మంది ముందుకొచ్చి రక్తదానం చేశారని.. ఇందులో ఎక్కువ మంది మొదటిసారి దాతలే ఉన్నారన్నారు.

ఈ రక్తనిల్వల్లో నిమ్స్‌కి 146.. మిగతావి తలసేమియా, సికిల్ సెల్ సొసైటీకి అందజేసినట్లు తెలిపారు.



## పోలీస్ అమరులను స్ఫూర్తిగా తీసుకోవాలి

**- పత్యనాయక్**

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):**

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు పత్యనాయక్ అన్నారు. సమాజంలో పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని, వారి స్ఫూర్తితో విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

మంగళవారం పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని పోలీస్ కార్యాలయ ఆవరణలోని దివంగత ఎస్ఐ హన్మంత రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పత్యనాయక్ మాట్లాడుతూ.. దేశం కోసం పోరాడి ప్రాణాలు వదిలిన వారి త్యాగాలను కొనియాడారు. పోలీసుల లేని సమాజాన్ని ఊహించలేమని, శాంతిభద్రతల పరిరక్షణలో సంఘవిద్రోహక శక్తులకు వ్యతిరేకంగా పోరాడి తమ ప్రాణాలను పణంగా పెడతారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, మాజీ వార్డ్ సభ్యుడు వస్పూల సాయిలు, గండికోట శంకర్, యూత్ వింగ్ అధ్యక్షుడు దేరంగుల వెంకటేష్, వడ్డెమోని శివకుమార్, నాగిళ్ళ జగన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లండం యాదయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమేష్ నాయక్, రూప్ సింగ్ నాయక్, వరకుప్పల గణేష్, పంతు నాయక్, సొమ్ల నాయక్, మహేష్ నేత తదితరులు పాల్గొన్నారు.






## యువత క్రీడలవైపు దృష్టి సారించాలి

**- ప్రభు శంకర్**

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):** యువకులు వ్యస నాలవైపు మళ్లకుండా క్రీడలపైపు దృష్టి సారించాలని డీకేపీఎస్ డాన్స్ అకాడమీ ఫౌండర్ ప్రభు శంకర్ సూచించారు. ఆమనగల్లు పట్టణ కేంద్రంలో రెండు రోజులగా నిర్వహించిన సర్కిల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్లో మొత్తం పది జట్టు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్ లో సర్కిల్ హీటర్స్ టీం విన్నర్స్ గా గెలిచారు. జి జి గ్లాడియేటర్స్ టీం రన్నర్స్గా నిలిచారు. టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి మీసాల గోపి బహుమతిని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ.. క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, పట్టుదల,జట్టు స్ఫూర్తి వంటి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. యువత దేశ భవిష్యత్తు అని, వారు చదువుతో పాటు క్రీడలలోనూ ప్రతిభ చూపి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

క్రీడా మైదానంలో చూపించే కృషి, క్రమశిక్షణ జీవితంలో కూడా విజయానికి దారి తీస్తుందని పేర్కొన్నారు. అదే విధంగా యువత సామాజిక సేవ, ప్రజాసేవ రంగాల్లో ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో గోరటి దేవేందర్, నీరటి (కొత్ర) రాజు, వరికుప్పల రాజు, కోరే మహేందర్, ఎనుమల్ల రమేష్, వస్పుల రంజిత్, కొమ్ము ప్రసాద్, తల్లోజు నర్సింహా, రామకృష్ణ, వస్పుల సురేష్ మరియు క్రికెట్ క్రీడాకారులకు, అభిమానులకు తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

**-డాక్టర్ శ్యాంసుందర్**

**వెల్దండ,అక్టోబర్ 21 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో లాల్ తండాలో పశువులకు గాలి కుంటు వ్యాధి రోగ నివారిణి టీకాలు వేయడం జరిగింది ఈ సందర్భంగా



డాక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ పశువులకు రైతులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధిక టీకాలు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సురేష్ రెడ్డి నరసింహ ఫణిందర్ రెడ్డి శ్రీను తిరుపతయ్య గోపాలమిత్రలు బాలు మొగులయ్య సాయిబాబు విజేందర్ రైతులు వీరారెడ్డి విజయేందర్ రెడ్డి నాగరాజ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన ఆచారి

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):** తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి మంగళవారం రాజ్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై, తదితర అంశాలపై ఆచారి మాటాడారు. అనంతరం ఈ నెల 31న జరిగే తన కుమారుడి నిశ్చితాదానికి రావాలని కోరుతూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వాన పత్రికను అందించారు.

## అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తి

**- సీఐ జానకి రామ్ రెడ్డి**

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):**

పోలీస్ అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తి అని ఆమనగల్లు సీఐ జానకి రామ్ రెడ్డి అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని పోలీస్ కార్యాలయ ఆవరణలోని దివంగత ఎస్ఐ హన్మంత రెడ్డి విగ్రహానికి





పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీఐ జానకి రామ్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ సరిహద్దు భద్రతలో సైనికుడు ఎంత కీలకమో అంతర్గత భద్రతలో పోలీస్ కూడా అంతే కీలకమన్నారు. ప్రజా అవసరాల కోసం సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణ ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతీ సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్ మరియు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఎమ్మెల్యేకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన గుర్రం కేశవులు

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):**

చీకట్లను తొలగించి వెలుగులు నింపే ఈ దీపావళి వేడుక ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు అన్నారు. ఈ దీపావళి ప్రతి ఇంట్లో వెలుగులు పంచాలని ప్రతి



ఒక్కరి జీవితంలో శాంతి, శ్రేయస్సు నిండాలని ఆకాంక్షించారు. వెలుగుల పండుగ దీపావళి సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సోమవారం ఉదయం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, శాంతి విజయాలను తెచ్చి పెట్టాలని కేశవులు ఆకాంక్షించారు.

## జైపాల్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపిన అర్జున్ రావు

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):**

చీకట్లను తొలగించి వెలుగులు నింపే ఈ దీపావళి వేడుక ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతులు నింపాలని బీఆర్ఎస్ పార్టీ ఆమనగల్లు మండల అధ్యక్షుడు అర్జున్ రావు అన్నారు. ఈ దీపావళి ప్రతి ఇంట్లో వెలుగులు పంచాలని ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, శ్రేయస్సు నిండాలని ఆకాంక్షించారు. వెలుగుల పండుగ దీపావళి సందర్భంగా



కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ ను మంగళవారం ఉదయం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి స్వీట్ అందించి శాలువాలతో సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, శాంతి విజయాలను తెచ్చి పెట్టాలని అర్జున్ రావు ఆకాంక్షించారు.

## దక్షిణాఫ్రికాలో కామారెడ్డి వాసి అనుమానాస్పద మృతి

**కామారెడ్డి,అక్టోబర్21(అక్షరగళం):** దీపావళి రోజు దక్షిణాఫ్రికాలో తెలంగాణ వాసి మృతిచెందాడు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌కు చెందిన బత్తుల శ్రీనివాస్ (32) అనుమానాస్పదస్థితిలో మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూర్‌కు చెందిన బత్తుల శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం దక్షిణాఫ్రికాకు వలస వెళ్లాడు. అక్కడ బోరింగ్ డ్రిల్లర్, డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే సోమవారం నాడు చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో తెలంగాణలోని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తమ కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా, మృతునికి భార్య నవిత, కూతురు లాస్య, కొడుకు నిహాల్ ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన ఎంపీడీఓ

**ఆమనగల్లు, అక్టోబర్ 21 (అక్షర గళం):**

ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోట పల్లి, సీతారాం నగర్ తండా గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో మంజూరైన లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలను ఎంపీడీవో కుసుమ మాధురి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు.

ఇష్టం వచ్చినట్టు ఇందిరమ్మ పథకంలో ఇంటి నిర్మాణాలు చేస్తే నిబంధనలు ఒప్పుకోవని వాటికి ఇంటికి సంబంధించిన రుణాలు మంజూరు చేయడం జరగదని లబ్ధిదారులకు తెలియజేశారు. నిర్మాణాలు చేపడుతున్న వాటిని వీలైనంత త్వరత్వరగా నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసుకోవాలని సూచించారు. నిర్మాణం పూర్తి అయితే డబ్బులు మూడు విడతలుగా లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలో నేరుగా ప్రభుత్వమే జమ చేయడం జరుగుతుందని లబ్ధిదారులకు సూచించారు. ఈ



కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, వినోద్, ఫీల్డ్ అసిస్టెంట్ జైపాల్, ఈదమయ్య మరియు ఇందిరమ్మ పథకం మంజూరైన లబ్ధిదారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఉప సర్పంచ్ చీమ్ముల శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి

**వెల్దండ,అక్టోబర్ 21 (అక్షర గళం):** వెల్దండ మండల బిజెపి పార్టీ మాజీ ఉప సర్పంచ్ చీమ్ముల శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకున్న జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు అన్ని విధాలుగా బిజెపి పార్టీ అండగా ఉంటుందని ఆ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు అనంతరం జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులకు 1లక్ష రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు అలాగే ఇంకా 1 లక్ష 40 వేల రూపాయలను వారి పిల్లల పై చదువుల కొరకు అందిస్తాం అని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి తాలూకా ఇంచార్జ ఎన్నం శేఖర్ రెడ్డి ఆచారన్న మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు మట్ట పరమేష్ గౌడ్ బిజెపి పార్టీ సీనియర్ నాయకులు తాటికొండ కృష్ణారెడ్డి సింగల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి మోహన్ రెడ్డి మట్ట విష్ణు గౌడ్ కంఠం రవికుమార్ శ్రీశైలం కొండల్ దేవేందర్ పెద్దయ్య బిజెపి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.









# సొంత డబ్బులతో వంతెన మరమ్మతులు చేయించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్





**వెల్దండ, అక్టోబర్ 21 (అక్షర గళం):** ఇటీవల కురిసిన వర్షాలకు వెల్దండ మండల పరిధిలోని సీలోన్ బాయి తండాకు వెళ్లే వంతెన తెగిపోయింది తండాకు వెళ్లే టందుకు తండా వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ద్వారా విషయం తెలుసుకున్న కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ తన దృష్టికి తీసుకొని రావడంతో వెంటనే స్పందించి సొంత డబ్బులతో వంతెన మరమ్మతులు చేయించారు. అలాగే 25 కె.వివిద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు . సమస్యలను పరిష్కరించిన కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్‌కు తండా వాసులు కృతజ్ఞతలు తెలిపారు.





# చెడును నరికివేసి మంచిని వెలిగించింది

### కుటుంబ సభ్యులతో దీపావళి పండుగను జరుపుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి,అక్టోబర్ 21(అక్షరగళం):** దుష్ట ప్రొతిగల నరకాసురుడిపై సత్యభామ సాధించిన విజయానికి చెడుపై మంచి గెలుపు గుర్తుగా దీపావళి పండుగను జరుపుకుంటామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మీడియాకు తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో హైదరాబాదులో ఆయన నివాసంలో ఆనందోత్సవాల మధ్య బాణాసంచా కాలుస్తూ కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు పరిసర ప్రాంతాల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ అంధకారాన్ని పారద్రోలే మహా పర్వదినమైన దీపావళి సందర్భంగా నియోజకవర్గ ప్రజలు దీపావళి పండుగ ప్రతి ఇంట్లో ఆనందం శాంతి ఐక్యత అభివృద్ధి దీపాలు వెలుగుల వలె విరజిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఆరోగ్యంగా సుఖశాంతులతో పంటలు పండి సమృద్ధిగా ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ దీపావళి పండుగ వెలుగులు కల్వకుర్తి నియోజకవర్గానికి మరింత వెలుగు తెచ్చేలా అభివృద్ధి పథంలో ముందుకు నడిపేలా మారాలని ఆశిస్తున్నట్లు ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి ఈ పర్వదినాన్ని సురక్షితంగా సంతోషంగా జరుపుకోవాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో పిల్లలు టపాసులు కాల్చే సమయంలో ప్రమాదాలు జరగకుండా తల్లి దండ్రులు జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే సూచించారు.





## ఎమ్మెల్యే కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 21, (అక్షరగళం):** బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదినం సందర్భంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు గోలిపల్లి దయాకర్ రెడ్డి, రెడ్డె బోయిన మల్లేష్ యాదవ్ ల ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల బోక్కెను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డ మీది బాలరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 26 అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఎంపీ డాక్టర్ మల్లు రవికి ఆహ్వాన పత్రిక అందజేత

**వెల్దండ, అక్టోబర్ 21 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలో ఈనెల 26 న భారత రాజ్యాంగం నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు డాక్టర్ మల్లు రవికి హైదరాబాదులో ఆయన నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు ఈ కార్యక్రమంలో తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య గుండాల గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎనుముల గోపాల్ కొమ్ము కృష్ణ కొమ్ము అంజయ్య కొమ్ము లింగం తదితరులు పాల్గొన్నారు.







# చిన్న నీటి పారు దల కార్యాలయం కూల్చివేత

**పనులను పరిశీలించిన**
**మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్**

కల్వకుర్తి అక్టోబర్ 21 (అక్షర గళం): కల్వకుర్తి పట్టణంలోని నడి బొడ్డున ఉన్న శివాజీ చౌక్ సమీపంలో ఉన్న పాత చిన్న నీటి పారుదల శాఖ కార్యాలయ భవనాన్ని మంగళవారం కూల్చి వేశారు. చిన్న నీటి పారుదల శాఖ కార్యాలయ నూతన భవనం లోనికి మార్చడంతో గత ఏండ్లకొద్దీ వృధాగా పడి ఉన్న ఈ కార్యాలయ స్థలంలో నూతనంగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయుటకు ప్రతి పాదనలు ప్రభుత్వం ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ తెలిపారు పాత చిన్న నీటి శాఖ కార్యాలయ భవనాన్ని కూల్చివేసినట్లు తెలిపారు. కల్వకుర్తి ముఖ్య కూడల్లో ఉన్న ఈ కార్యాలయ ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగితే కల్వకుర్తి పట్టణం రూపురేఖలు మారనున్నాయి.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి

కల్వకుర్తి అక్టోబర్ 21 (అక్షర గళం):
తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జల్ గ్రామపంచాయతీ లో మాజీ సఫాయి కార్మికుడు లకు మల్ల చెన్న కిష్టయ్య ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకోరి ప్రభాకర్ రెడ్డి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శతాబ్ది టౌన్షిప్ ఎండి సీనియర్ కాంగ్రెస్ నాయకులు మృతుడి కుటుంబానికి 4000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్రెడ్డి ?1000 మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసమూర్తి 1000 రూపాయలు అంబాజీ 1000 రూపాయలు మాజీ ఉపసర్పంచ్ అజీజ్ 2000 మొత్తం 12 వేల రూపాయలు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు పరామర్శించిన వారిలో మాజీ ఉపసర్పంచ్ అజీజ్ నాయకులు కృష్ణయ్య గౌడ్ లింగం యాదవ్ రాజు మల్లేష్ లక్ష్మణ్ రామకృష్ణ విష్ణు రమేష్ రాములు జంగయ్య రాములు ఆంజనేయులు రమేష్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ల కోసం బస్తీ దవాఖానాలను చిదిమేస్తారా?

**- జ్వరం మందులకూ దిక్కులేని పాలన**
**- బస్తీ దవాఖానాలకు సుస్తీ రేవంత్ పాలన పుణ్యమే**
**- కేసీఆర్ ఇచ్చిన మందులకు మంగళం**
**- బస్తీ దవాఖానలు ఉత్సవ విగ్రహాలుగా మారిన విషాదం**
**- ఎమ్మెల్సీ డా.శ్రవణ్ దాసోజు ఆగ్రహం**

హైదరాబాద్, (అక్షర గళం): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు షేక్‌పేట్ డివిజన్‌లోని షేక్‌పేట్ గ్రామంలో నిర్వహించిన బస్తీ దవాఖాన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ డా.శ్రవణ్ దాసోజు నందికంటి శ్రీధర్‌తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా. శ్రవణ్ దాసోజు మాట్లాడుతూ, "బస్తీ దవాఖానల ప్రస్తుత పరిస్థితి చూస్తే విస్తుపోవాల్సిన పరిస్థితి ఉంది. దాదాపు 1,500 బస్తీలు ఉన్న హైదరాబాద్ నగరంలో ప్రతి బస్తీకి ఒక దవాఖాన ఉండాలని కె.చంద్రశేఖర రావు మానవతా దృక్పథంతో ఒక మహోన్నతమైన ఆలోచన చేశారు. పేద మరియు మధ్యతరగతి ప్రజలకు విద్య, వైద్యం అనే రెండు ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కెసిఆర్ బస్తీ దవాఖానల రూపకల్పన చేశారు," అని పేర్కొన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులను బ్రతికించేందుకు బస్తీ దవాఖానలను నిర్లక్ష్యం చేయడం బాధ్యత రహితమైందే కాక మానవతా రాహిత్యానికి నిదర్శనం.

"ఒకవైపు పేద పిల్లలకు అద్భుతమైన రెసిడెన్షియల్ స్కూల్‌లను ఏర్పాటు చేసి విద్యా అవకాశాలను కల్పిస్తే, మరోవైపు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లలేని ప్రజలకు బస్తీల్లోనే నాణ్యమైన వైద్యం అందించే విధంగా కెసిఆర్ గారు ఈ బస్తీ దవాఖానలను రూపొందించారు. ఈ మోడల్ దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందింది. కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొత్తం ఆరోగ్య వ్యవస్థ కుప్పకూలిపోయింది.



ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని బస్తీ దవాఖానలు పూర్తిగా సర్వనాశనం అయ్యాయి," అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

"కెసిఆర్ పాలనలో 149 రకాల మందులు అందించేవారు. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం 39 రకాల మందులు మాత్రమే ఇస్తోంది. వంద రకాల మందులకు మంగళం పాడేశారు. ప్రజల టాక్స్ మనీతో నడిచే హైదరాబాద్‌లో weighing మెషిన్ పనిచేయని పరిస్థితి, డయాగ్నస్టిక్ సర్వీసులు సరిగా లేని పరిస్థితి దారుణం. బస్తీ దవాఖానలను ఉత్సవ విగ్రహాలుగా మార్చి ప్రజలను మభ్యపెడుతున్నారు," అని దాసోజు విమర్శించారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ , చేరిక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ పాలనలో మున్నూరు కాపులకు అన్యాయం

**- బీసీలను మోసం చేసిన కాంగ్రెస్**
**- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో ఎంపి వద్దిరాజు**

హైదరాబాద్, (అక్షర గళం): రేవంత్ రెడ్డి పాలనలో మున్నూరుకాపులు, బీసీలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నన్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎన్నికల ముందు నుంచే మున్నూరుకాపులు,బీసీలకు కాంగ్రెస్ తీరని ద్రోహం మొదలుపెట్టిందన్నారు.

ఆ పార్టీ కేవలం 19మంది బీసీలకు మాత్రమే ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మాగంటి సునీతను భారీ ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరుతూ షేక్ పేట సీతానగర్ లో మున్నూరుకాపు ప్రముఖులతో ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజ్ శ్రవణ్ కుమార్, కార్తీక్ రెడ్డి, ముఠా జయసింహలతో మంగళవారం రాత్రి సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, గత ఎన్ని కలలో కాంగ్రెస్ 3గురు మున్నూరుకాపులకు మాత్రమే టిక్కెట్లిస్తే, ఆది శ్రీనివాస్ ఒక్కరే గెలవడం జరిగిందన్నారు. మంత్రివర్గంలో మున్నూరు కాపు, యాదవ, కురుమ, ముస్లిం, లంబాడలకు చోటివ్వకపోవడం విచారకరమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇటువంటి పరిస్థితి తలెత్తలేదని ఎంపీ రవిచంద్ర వాపోయారు.

కులగణన సందర్భంగా 30 లక్షల మంది బీసీలను ఈ సర్కార్ చంపేసిందని,ఇందులో సగం మంది మన మున్నూరు కాపులు ఏ ఉండడం శోచనీయమన్నారు. కేసీఆర్ పాలనలో మున్నూరుకాపు సముచిత గౌరవం దక్కిందని, తనతో పాటు కేకే, డీఎస్ ను పెద్దల సభ రాజ్యసభకు పంపారని, బండా ప్రకాష్, బడుగుల లింగయ్య యాదవ్ లు కూడా రాజ్యసభ సభ్యులుగా సేవలందించారని ఎంపీ రవిచంద్ర వివరించారు.

మధుసూదనాచారిని స్పీకర్ గా, స్వామి గౌడ్‌ను కౌన్సిల్ ఛైర్మన్‌గా నియమించారని, జోగు రామన్న, కమలాకర్‌ను కేబినెట్‌లోకి తీసుకున్నారని బొంతు రాంమోహన్, విజయలక్ష్మీలను మేయర్లను చేసి గౌరవించారని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. ఈ విధంగా చెప్పుకుంటేపోతే కేసీఆర్ ఆరుగురిని ఎమ్మెల్సీలను చేశారని తెలిపారు. బీసీలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు 300 మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో గురుకులాలు పెట్టారని, విదేశాలలో చదువుకునే వారికి 20లక్షలు



ఉచితంగా అందజేశారని వివరించారు.

రేవంత్ రెడ్డి 42% రిజర్వేషన్స్ ఇస్తానని నమ్మించి బీసీల ఓట్లు దండుకుని, ఇప్పుడు నాటకాలు ఆడుతున్నారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో మనమందరం మరింత సంఘటితమై పార్టీని బలోపేతం చేస్తూ ఏకపక్షంగా బీఆర్ఎస్ అభ్యర్థి సునీతకు ఓట్లేసి కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించి గట్టిగా బుద్ధి చెబుదామని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో మున్నూరుకాపు ప్రముఖులు వాసాల వెంకటేష్, ఆర్వీ మహేందర్, తోట వేణుగోపాల్ రావు, మహేష్, అరుణ్,చంద్రయ్య, ప్రవీణ్, వినోద్, రమేష్, రమణారావు, మదన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రను శాలువాతో సత్కరించారు.

# నేరెళ్ల సంఘటనపై ప్రవీణ్ కుమార్ ఎందుకు నోరు మెదపలేదు?

**- సొంత సైన్యాన్ని నిర్మించుకొని ప్రవీణ్ కుమార్ అరాచకాలు**
**- బాల్క సుమన్ చేసిన అరాచకాలపై చర్చకు సిద్ధమా?**
**- కబ్జాలకు పెట్టింది పేరు కేటీఆర్ అండ్ కంపెనీ కాదా ?**
**రైతులకు బేడీలు వేసిన మీరు రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పదం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

హైదరాబాద్, (అక్షర గళం): మాఫియా, డాన్లు, కాంట్రాక్టులు, కమిషన్ల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది. బ్లాక్ మెయిలింగ్ చేయడంలో దిట్ట అయిన బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మంత్రుల గురించి మాట్లాడే ముందు కేసీఆర్ పదేళ్ల పాలనపై ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో గురుకులాల పరిస్థితిని, ప్రస్తుతం గురుకులాల్లో పరిస్థితులను బేరీజు వేసుకుంటే బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం కాంగ్రెస్ ఎంత ప్రాధాన్యతిస్తుందో స్పష్టమవుతోంది. కేసీఆర్ హయాంలో గురుకులాలు అస్తవ్యస్తంగా ఉన్నా నోరు ఎత్తని ప్రవీణ్ కుమార్ ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారు.

కొందరు గురుకులాల విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేసి సొంత సైన్యాన్ని నిర్మించుకొని ప్రవీణ్ కుమార్ చేసిన అరాచకాలు బహిరంగ రహస్యమే. తాను ఐపీఎస్ అధికారి అని చెప్పుకునే ప్రవీణ్ కుమార్ తెలంగాణలో సంచలనం రేపిన నేరెళ్ల సంఘటనపై ఎందుకు నోరు మెదపలేదు? అప్పుడు బీఆర్ఎస్ నేతలను కేసీఆర్ ప్రభుత్వం కాపాడుతుంటే, దళితులకు న్యాయం కోసం ప్రవీణ్ కుమార్ ఎందుకు ముందుకు రాలేదు?

ఉద్యమం పేరుతో యువతను, విద్యార్థులను రెచ్చగొట్టిన బాల్క సుమన్ బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించారే కానీ, యువత కోసం ఎప్పుడు పోరాడలేదు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాలు లేకుండా యువత ఉద్యమిస్తుంటే యువనేతగా చెప్పుకునే సుమన్ ఎక్కడ దాక్కున్నారు? కేసీఆర్ కుటుంబంతో సన్నిహితంగా మెలిగే బాల్క సుమన్ వారి అండతో చేసిన అరాచకాలపై చర్చకు సిద్ధమా.?



శాంతి భద్రతల గురించి మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబం చేసిన ఫోన్ ట్యాపింగ్, దౌర్జన్యాల గురించి చర్చకు మందుకొస్తారా? సొంత కుటుంబ సభ్యులను, మంత్రుల ఫోన్ ట్యాపింగ్ చేసి తమ చెప్పుచేతల్లో పెట్టుకున్న కేటీఆర్ గురించి ప్రవీణ్ కుమార్ ముందుగా మాట్లాడితే మంచిది. సొంత మంత్రులపైనే నిఘా పెట్టి బ్లాక్ మెయిలింగ్ చేసిన కేసీఆర్ కుటుంబానికి దాసోహమైన ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్ లకు కాంగ్రెస్ మంత్రులపై మాట్లాడే హక్కే లేదు.

సోషల్ మీడియాలో కేసీఆర్ ప్రభుత్వం అరాచకాలను ప్రశ్నించిన వారిని వేధించిన ఘటనలను ప్రవీణ్ కుమార్ మర్చేపోయారు. గ్రేటర్ చుట్టు పక్కల కబ్జాలకు పెట్టింది పేరు కేటీఆర్ అండ్ కంపెనీ కాదా అని ప్రశ్నిస్తున్నాను. కేసీఆర్ కుటుంబ సభ్యుల బెదిరింపులకు, అరాచకాలకు బెదిరి ఎన్నో కంపెనీలు పక్క రాష్ట్రాలకు వెళ్లిన సంగతి వీరికి తెలియదా? రైతులకు బేడీలు వేసిన మీరు రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పదం.

# కాంగ్రెస్ సర్కారుపై కాంగ్రెస్ పెద్దలకు నమ్మకం లేదు

- **మంత్రులు, ఎమ్మెల్యేల తిరుగుబాటు**
- **అందుకే ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు**
- **రేవంత్ దోపిడీకి బీజేపీ అండదండలు**
- **రేవంత్ సర్కారు ఎన్ని స్కాములు చేసినా కేంద్ర విచారణ సంస్థలు పట్టించుకోవడం లేదు**
- **రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీష్ రెడ్డి**

హైదరాబాద్, (అక్షర గళం):తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందనేది స్వయంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేనే ఒప్పుకున్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ప్రజలను, చివరకు వాళ్ల పార్టీ అగ్ర నాయకులను కూడా మభ్యపెట్టే ప్రయత్నాల్లో రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారు.

తెలంగాణ ప్రజలను మోసం చేసినట్టే.. పార్టీ అగ్ర నాయకులను మోసం చేద్దామని చూశారు. కానీ అట్టర్ ఫ్లాప్ అయ్యారు. అందుకే.. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేకుండా పోయిందని పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే కు కూడా అర్థమైపోయింది.

అందుకే రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వదిలేసింది. ఇక జీవితంలో మళ్లీ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఏ కోశానా కనిపించడం లేదని ఢిల్లీకి కూడా తెలిసిపోయింది. అందుకే ఇక్కడ మీనాక్షి నటరాజన్ తో రేవంత్ రెడ్డికి సమాంతరంగా మరో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నట్టుగా అర్థమవుతోంది. గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి.. ఈ వర్గం.. ఆ వర్గం అని లేకుండా..అన్ని వర్గాలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ.

రేవంత్ రెడ్డి చేస్తున్న మోసాలు.. మాట్లాడుతున్న చిల్లర మాటలతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారు. రేవంత్ రెడ్డి పేరు వినబడితేనే ఛీ.. అనే



పరిస్థితి వచ్చింది. రెండేళ్లలోనే ప్రజల నుండి ఇంత వ్యతిరేకత రావడంతో ఇక్కడ తమ పార్టీ పని అయిపోయిందని స్వయంగా ఖర్గేకే అవగతమైంది. ఇప్పుడు మిగతామూడేళ్లు కూడా ప్రభుత్వం ఉంటుందో ఊడిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ లోని మంత్రులు, ఎమ్మెల్యేల తిరుగుబాటుతో కాంగ్రెస్ సర్కారు పరిస్థితి తుమ్మితే ఊడిపోయే ముక్కులా మారింది.

అందుకే ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి.. అక్రమ సంపాదన మీద కాంగ్రెస్ నాయకులు ఫోకస్ పెట్టారు. కిందిస్థాయి నాయకుల నుండి ముఖ్యమంత్రి వరకు అందినకాడికి దోచుకుంటున్నారు. మళ్లీ అవకాశం రాదని..ఇప్పుడే భారీగా సంపాదించుకోవాలని.. తెలంగాణను తెగనమ్ముతున్నారు. అందుకే కావొచ్చు రేవంత్ రెడ్డి పూర్తిగా బీజేపీకి దగ్గరై, మోడీ ఆదేశాల ప్రకారం, మోడీ విధానాలను అమలు చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. అలాగే రేవంత్ సర్కారు ఎన్ని స్కాములు చేసినా, ఆయన కేబినెట్ లోని మంత్రులు, వారి అనుచరులు ఎన్ని స్కాములు చేసినా కేంద్ర విచారణ సంస్థలు పట్టించుకోవడంలేదు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముగిసిన నామినేషన్ల గడువు

హైదరాబాద్, (అక్షర గళం): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గ ఉప ఎన్నిక నామినేషన్ల గడువు ముగిసింది.. ఉప ఎన్నికల్లో పోటీకి చివరి రోజున పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 150కి పైగా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల చివరి రోజున బీజేపీ తరఫున లంకల దీపక్ రెడ్డి సైతం ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటికే, బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్










నామినేషన్లు దాఖలవగా, అభ్యర్థుల సంఖ్య 100 మార్క్‌ని దాటింది.

మూడు గంటల తర్వాత గేటు లోపల ఉన్న వారికి మాత్రమే అధికారులు నామినేషన్లు వేసేందుకు అవకాశం కల్పించారు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు భారీగా నామినేషన్స్ వేశారు. ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు, ఓయూ నిరుద్యోగ వికాస నాయకులు తరఫున నవీన్ యాదవ్ నామినేషన్లు వేశారు. రేపటి నుంచి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి సాయిరాం పరిశీలించ నున్నారు. ఇక 24న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉన్నది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగనుండగా, 14న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు.

# ఆరోగ్య రంగంలో హుస్నాబాద్ అభివృద్ధి

**ఆసుపత్రి నిర్మాణం తరవాత పూర్తిస్థాయి స్టాఫ్**
**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

సిద్దిపేట,అక్టోబర్21(అక్షరగళం):
హుస్నాబాద్‌ను ఆరోగ్యరంగంలో నెంబర్ వన్ కేంద్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఎనిమిది మంది వైద్యులు పనిచేస్తున్నారని, కొత్త భవనం పూర్తి కాగానే 38 మంది డాక్టర్లు విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు.



హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సందర్శించారు. నూతనంగా నిర్మాణంలో ఉన్న 250 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించిన మంత్రి, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.




ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సుమారు 82 కోట్ల రూపాయల వ్యయంతో ఆధునాతన సదుపాయాలతో కూడిన 250 పడకల హాస్పటల్ నిర్మాణం జరుగుతోంది. హుస్నాబాద్‌లో నర్సింగ్ కాలేజీ స్థాపనకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 'మహాసముద్రం గండి పనులు టూరిజం అభివృద్ధి కోసం వేగంగా కొనసాగుతున్నాయి. గౌరవెల్లి కాలువల పనులకు భూసేకరణ జరుగుతోంది. రైతులు అందరూ సహకరించాలని కోరుతున్నాను అని తెలిపారు. ఇక మహిళా సంఘాల అభ్యున్నతికి పొన్నం సత్తయ్య ట్రస్టు ద్వారా 13 రకాల వస్తువులతో కూడిన స్టీల్ పాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 'ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, ప్రాజెక్టులు, ఇన్ఫాస్ట్రక్చర్.. అన్ని రంగాల్లో హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం' అని మంత్రి స్పష్టం చేశారు.

# సంపాదకీయం..

## గూగుల్ లాంటి సంస్థలను స్వాగతించాల్సిందే!

హైదరాబాద్ అభివృద్ధి, సైబరాబాద్ సృష్టి ఈ రెండు ఇవాళ తెలంగాణ గతినే మార్చాయి. ఐటి అభివృద్ధితో హైదరాబాద్ ముఖచిత్రమే మారిపోయింది. రియల్ రంగంలో కొత్త పోకడలు వచ్చాయి. ఉమ్మడి ఎపిలో చంద్రబాబు పాలన ఎలా ఉన్నా, ఆయన ఏం చేసాడనే విమర్శలకు పోకుండా పరిశీలిస్తే... ఐటిని విస్తరింప డం కోసం తీసుకున్న నిర్ణయాలు ఇవాళ హైదరాబాద్‌ను అగ్రభాగాన నిలబెట్టాయి. హైటెక్ సిటీ రాకతో సైబరాబాద్ అనూహ్యంగా విస్తరించడం, అనేక దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటు కావడంతో లక్షల్లో ఉద్యోగాలు వచ్చాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొన్ని లక్షల మంది హైదరాబాద్‌లో ఉపాధి పొందుతున్నారు. ఇప్పటి 70శాతం ఆదాయంతోనే తెలంగాణ మనగలుగుతుందనడంలో సందేహం లేదు. రియల్ ఎస్టేట్ అనూహ్యంగా



విస్తరించింది. ఇది కాదనలేని సత్యం. ఇప్పుడు అమరావతి నిర్మాణం, విశాఖను ఐటి హబ్‌గా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందించాల్సిందే. ఎందుకంటే విడివడ్డ తెలుగు రాష్ట్రం అభివృద్ధి చెందడం తెలుగువారికి గర్వకారణంగా మారాలి. అమరావతి, విశాఖలు అభివృద్ధి చెందితే అక్కడి స్థానికులకు కూడా లక్షల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. దీనిని రాజకీయాలకు అతీతంగా అందరం స్వాగతించాల్సిందే. వైకాపా ఐదేళ్ల పాలనలో అమరావతినే కాదు, రాజధానిని తుంగలో తొక్కింది. మూడు రాజధానులంటూ అసలు రాజధాని లేకుండా చేశారు. ఇవాళ అదే వైకాపా అమరావతిని, గూగుల్ రాకను వ్యతిరేకిస్తోంది. విశాఖలో అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ రావడం ఎంతో పురోగమిస్తుందని, గూగుల్ సిఈవో సుందర్ పిచాయ్ స్వయంగా చెప్పారు. గూగుల్ సంస్థ డేటా సెంటర్ల ఏర్పాటుకు అమెరికాలోనూ భారత్‌లోనూ భారీగా పెట్టుబడులు పెడుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే చంద్రబాబుకు లేదా ఐటీ మంత్రి లోకేశ్‌కు వ్యక్తిగతంగా లాభం ఏమీ ఉండదు లేదా అన్నది ముఖ్యం కాదు. ఎందుకంటే పెట్టుబడుల ఫలితాలను ప్రజలు అనుభవిస్తారు. హైదరాబాద్ ఐటీరంగ విస్తరణె ఇందుకు నిదర్శనం. గూగుల్ సంస్థ రాకను మెచ్చుకోవాల్సిన వైకాపా నేతలు అదేపనిగా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గూగుల్ గేమ్‌చేంజర్ అనే చెప్పవచ్చు. హైదరాబాద్ తో పోటీపడేలా విశాఖకు అవకాశాలు ఉన్నాయి. సంక్షేమం పేరిట ప్రభుత్వం అదేపనిగా ఉచిత పథకాలు ప్రవేశ పెట్టడం సరికాదు. ఇలాంటి సంస్థలను ప్రోత్సహించాలి. ఇలా వచ్చేవారికి తోడ్పాటును అందించాలి. చంద్రబాబుపై నమ్మకంతో ఆంధ్రపద్రేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి మొదలైంది. గూగుల్ నిర్ణయం తర్వాత మరిన్న సంస్థలు రావచ్చు. ఇప్పటికే టిసిఎస్ కూడా తన క్యాంపస్ ప్రారంభించడానికి అంగీకరించింది. ఇదే ఒరవడి కొనసాగితే పెట్టుబడుల వెల్లువపెరుగుతుంది. అయితే జగన్ బృందం గూగుల్ సహా అనేక కంపెనీల రాకపై విమర్శలు చేస్తున్నది. పెట్టుబడులు రావడం, అభివృద్ధి జరగడం అన్నది ఎవరైనా స్వాగతించాల్సిందే. జగన్ అధికారంలో ఉండగా ఇలాంటి సంస్థల రాక అన్నది చూడలేదు.

అవినీతిని వ్యవస్థీకృతం చేసిన జగన్, కల్తీ మద్యం, ఊరూపేరు లేని బ్రాండ్లతో విచ్చలవిడి నకిలీ వ్యాపారం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతోనే రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం వ్యాపారం జరుగుతోందని అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి కల్తీ మద్యం అమ్మకాలకు మాఫియా కారణం. దానివెనక రాజకీయ నేతలే ఉంటారు. ఇప్పుడు ఎపిలో పట్టుబడ్డ కల్తీకి రాజకీయ నేతలే అండగా ఉన్నారు. అందుకే కల్తీ సారా, కల్తీ మద్యం తాగి అడపాదడపా అనేకులు మరణిస్తూనే ఉంటారు. ఇప్పుడు కల్తీ మద్యం గురించి గగ్గోలు పెడుతున్న జగన్, ఆయన అనుచరులు గతంలో వారి పాలనలో కల్తీ మద్యం సరఫరా అన్నది ప్రభుత్వ పరంగానే చేశారు. జంగారెడ్డిగూడెంతో పాటు మరికొన్ని ప్రాంతాలలో ఆ మద్యం తాగి పలువురు

మరణించిన విషయం గుర్తించాలి. ములకలచెరువులో కల్తీ వ్యవహారం బయటకు రాగానే బాధ్యులందరినీ ప్రభుత్వం అరెస్టు చేసింది. వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రోద్బలంతోనే కల్తీ మద్యం తయారు చేశానని ప్రధాన నిందితుడు జనార్దనరావు చెప్పారు. ఇందులో నిజానిజాలు బయటికి వచ్చేలా కఠినంగా వ్యవహరించాలి. మద్యం కుంభకోణంలో సిట్ దర్యాప్తు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కూడా వారి లక్ష్యం కావచ్చు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడంతో పాటు విపక్ష పార్టీగా వైకాపా అభివృద్ధిని కూడా స్వాగతించాలి. కానీ గూగుల్ లాంటి సంస్తల రాకను తప్పుపట్టడంమో, విమర్శించడమో సరికాదు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాగుపడాలంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలి. అనేక సంస్థలు రావాలి. గూగుల్ రావాలి, టిసిఎస్ ఇతర సంస్థలు రావాలి. ఎపిలో పెట్లుబడులు లక్ష్యంగా చేపట్టిన సిఐఐ సదస్సును విజయవంతం చేయాలి. అనేక సంస్థలు వచ్చి తమ కార్యలాపాలు సాగించేలా ప్రోత్సహించాలి. అందుకు అందరూ అభినందించాలి. అప్పుడే ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి భరోసా కలుగుతుంది. అంతేకానీ వారిలో అపనమ్మకం కలిగేలా ఎవరు విమర్శలు చేసినా క్షంతవ్యం కాదు. అమెరికాలో తెలుగువారికి ఎసరు పెడుతున్న ట్రంప్ చర్యలతో ఇప్పుడక్కడ అనిశ్చితి నెలకొంది. మనవారికి ఇక్కడే ఉద్యోగాలు రావాలంటే గూగుల్ తదితర సంస్థలు రావాలి. అవి పోటీపడి తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడితే మనం అమెరికా తదితరదేశాలకు వెళ్లాల్సిన ఆగత్యం ఉండదు.

---

### డిప్యూటి సిఎం డికెతో

# కిరణ్ మజుందార్ షా భేటీ

### మేనల్లుడి వివాహానికి ఆహ్వానం అందచేత

భారత సిలికాన్ వ్యాలీగా అభివర్ణించే బెంగళూరులో రోడ్ల దుస్థితిపై పారిశ్రామికవేత్తల విమర్శలు, నేతల వ్యంగ్యాస్త్రాలతో ఇటీవల కర్ణాటకలో రాజకీయ దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ వివాదం కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా మంగళవారం భేటీ అయ్యారు. ఉదయం డిప్యూటీ సీఎం నివాసానికి వచ్చిన కిరణ్ మజుందార్ షా.. తన మేనల్లుడి వివాహానికి డీకేను ఆహ్వానించారు. అంతకుముందు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి ఆయనను కూడా పెళ్లికి ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. శివ కుమార్‌తో భేటీ అనంతరం కిరణ్ మజుందార్ షా మీడియాతో మాట్లాకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటికి ఈ సమావేశం గురించి డీకే తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. బెంగళూరు పురోగతి, సృజనాత్మక, రాష్ట్ర అభివృద్ధి మార్గాలపై ఆమెతో చర్చించి నట్లు డీకే వెల్లడించారు.



గత కొంతకాలంగా బెంగళూరు రోడ్ల పరిస్థితిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బయోకాన్ పార్క్‌కు వచ్చిన ఓ విదేశీ విజిటర్.. నగరంలోని రోడ్లు, చెత్తపై చేసిన వ్యాఖ్యలతో తాను ఇబ్బందిపడ్డానని కిరణ్ మజుందార్ షా ఓ పోస్టులో వెల్లడించారు. ఇది కాస్తా వైరల్‌గా మారింది. దీనిపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యంగ్యంగా బదులిచ్చారు. ఆమె రోడ్లను అభివృద్ధి చేయాలనుకుంటే చేయొచ్చన్నారు. అందుకోసం నిధులు కూడా ఇస్తామన్నారు. వ్యక్తిగత అజెండాతోనే ఆమె ఈ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆమెకు పలువురు పారిశ్రామికవేత్తలు మద్దతుగా నిలిచారు. సమస్యకు పరిష్కారం వెతకడం మాని రాజకీయాలు చేస్తున్నారంటూ హర్ష్ గొయెంకా అసహనం వ్యక్తం చేశారు. బెంగళూరు కోసం గళమెత్తే వారిపై దాడులు చేసే ట్రెండ్ సరికాదని, దాన్ని మానుకోవాలని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

---

### లడ్డూని ఎప్పటి నుంచీ స్వామి వారికి

# ప్రసాదంగా నివేదిస్తున్నారో తెలుసా...

### తిరుమల గురించి తెలియనవి!

### తిరుమల లడ్డూ వయసెంతో తెలుసా!

తిరుమల అంటే మనలో చాలా మందికి టక్కున గుర్తుకు వచ్చేది లడ్డూ ప్రసాదమే. వందల ఏళ్లకు పూర్వమే తిరుమల ఆలయం దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ప్రాచుర్యం పొందింది. అలాంటి ఆలయం పేరు చెప్పగానే గుర్తు వచ్చే లడ్డూని ఎప్పటి నుంచీ స్వామి వారికి ప్రసాదంగా నివేదిస్తున్నారో తెలుసా. కమ్మటి వాసనతో, చక్కటి రుచితో, ఎన్నో రోజులు నిలువ ఉండే ఈ లడ్డూకి వయసు కేవలం 226 ఏళ్ళు మాత్రమే. 17 శతాబ్దానికి పూర్వం ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎక్కువగా వడ ప్రసాదాన్ని అమ్మేవారు. 13వ శతాబ్దానికి ముందు నుంచీ ఆలయంలో ప్రసాదం కోసం దాతలు దేవదేయం చేసేవారు. అలా బంగారమో, ధనమో, భూములో దేవదేయంగా దానం చేసేటప్పుడు శిలాశాసనం వేసేవారు. ఆలయ కమిటీ సభ్యులైన స్థానత్తార్లు దేవదేయం చేసినప్పుడు ఆ నైవేద్య గంగాళంలో భాగాలను సిబ్బందికి, అధికార్లకు, స్థానత్తార్లకు, అర్చకులకు చెందేట్లు శాసనం రాసేవారు. అలా వచ్చిన భాగాలను అధికార్లంతా కలసి ఒక కౌంటరు ద్వారా యాత్రికులకు అమ్మేవారు. దూర ప్రాంతాల నుంచీ వచ్చిన రాజులు, ధనవంతులూ దేవదేయం చేసేటప్పుడు మాత్రం ప్రాసాదంలో కొంత భాగాన్ని, ముఖ్యంగా దాతల భాగాన్ని యాత్రికులకు ఉచితంగా పంచిపెట్టాలని శాసనం రాయించేవారు. ఈ వ్యవస్థనంతా తారుమారు చేస్తూ, ఎక్కువ భాగం యాత్రికులకు, ఆలయంలో కాయకష్టం చేసే సిబ్బందికి, అర్చకులకు అందేలా దేవదేయం చేసినవాడు మాత్రం గోల్కొండ మంత్రి అక్కన్న. తిరుమల, గోల్కొండ పరిపాలన కిందకి వచ్చాకా ఆయన దిగువ తిరుపతిలోనే చాలా కాలం ఉండి అక్కడి నుంచే తన బాధ్యతలు నిర్వర్తించినట్లు చారిత్రిక ఆధారాలు ఉన్నాయి.

అయితే ఆలయం ఈస్టిండియా కంపెనీ వారి అధికారంలోకి వచ్చాకా వారు చేసిన పని, ఆలయ దేవదేయం కింద వచ్చిన భూముల్ని, ఊర్లని హస్తగతం చేసుకోవడం. అలాగే దేవదేయంగా తయారు చేయబడిన ప్రసాదంలో అందరి భాగాలనూ తీసేసుకుని యాత్రికులకు అమ్మి, సొమ్ము చేసుకున్నారు కంపెనీ వారు. అలాంటి సమయంలోనే 1803లో ఎక్కువ రోజులు నిలువ ఉండేలాగా, ఎక్కువ అమ్మేందుకు వీలు ఉండేలాగా అప్పటికే ప్రసాదంగా ఉన్న తీపి బూందీని, లడ్డూగా మార్చి అమ్మడం ప్రారంభించారు. అలా ఆలయ ప్రసాదాల చిట్టాలోకి లడ్డూ వచ్చి చేరింది. నిజానికి చాలా మంది భక్తులకు తెలియని శ్రీవారి ప్రసాదాలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని:

సంధి తిరుప్పొనకం-అన్న నైవేద్యం
తిరుప్పొనకం
రజన తిరుప్పొనకం
వెళ్ళై తిరుప్పొనకం
అర్ధనాయకతళిగ
నాయికతళిగ
దధ్యోదనం
మట్టిరాయ్ తళిగ
తిరుప్పొవడ-పులిహోర లాంటిది
తిరువలక్కం
తిలాన్నం-నువ్వుల అన్నం
అక్కలిమండై
ఇవన్ని అన్నప్రసాదాలే.

ఇక భక్ష్యాల విషయానికి వస్తే:
అప్పపడి-అప్పాలు
అతిరసపడి-అరిసెలు
వడైపడి-వడ
గోధిపడి-గోధుమవడ
సుఖియాన్ పడి
ఇడ్డిలీపడి-ఇడ్లీ
సిడై పడి
ప్రోదిలింగైపడి
పోరిపడి-అటుకులు
తిరుక్కనమడై-మినప సున్నుండ
దీనినే మనోహరపడి అంటారు. కర్ణాటకలోని మేల్కోటే, మధురై మీనాక్షీ అమ్మవారి ఆలయాలలో ప్రధాన ప్రసాదం ఇది.
పారుప్పువియంలు-సాతాళించిన గుగ్గిళ్ళు
దీనినే సుండల్ అని కూడా అంటార్).
అవల్ పడి-గట్టి అటుకులు, తెరకు లాల్
పంచవాహి-పవిత్ర అన్నం, బెల్లం
పంచదార, పళ్ళు
ప్రత్యేకంగా అయా ఋతువులలో పండే పళ్ళు ఖచ్చితంగా ఉండి తీరాలి
వేయించిన జీడిపప్పు, బాదంపప్పు
పవళింపు సేవ అనంతరం నివేదన చేస్తారు
జిలేబి, దోసె, ఉదయం కొలువు (పంచాగం చదివి, ముందు రోజు జమా ఖర్చులు, ఆ రోజు కొలువు శ్రీనివాసునికి విన్నవిస్తారు) తరువాత నివేదన చేసేవి:
వేయించిన నువ్వుల పొడి, కజ్జికాయలు, పాలు,
పెరుగు, వెన్న, తాంబూలం

వంటి ఎన్నో రకాల ప్రసాదాలు స్వామి వారికి నివేదన చేస్తారు. అయితే ఇవేవి కులశేఖరపడి దాటి గర్భగుడిలోనికి వెళ్ళవు. గర్భగుడిలోని మూల మూర్తికి కేవలం సగం పగలగొట్టిన కొత్త కుండలో అన్నాన్ని నివేదన చేస్తారు. నివేదన పూర్తయ్యాకా దానిని విసర్జించి, తరువాతి రోజుకి కొత్త కుండ తెస్తారు. అందుకే అన్నమయ్య "తోమని పళ్ళాలవాడా" అని వేంకటేశ్వరుని పిలిచాడు. విజయనగర పరిపాలనా కాలం తిరుమలకు స్వర్ణ యుగంగా చెప్పుకోవచ్చు. సంపద, స్వామివారికి నగలు, యాత్రికుల పెరుగుదల మాత్రమే కాక, ప్రసాదాల విషయంలోనూ ఒక వెలుగు వెలిగిందనే చెప్పాలి.

ఆ సమయంలో శ్రీనివాసుడు రోజుకు 100 రకాల



ప్రసాదాలు స్వీకరించేవాడు. కానీ ఎంతోమందికి ఇష్టమైన లడ్డూని ప్రసాదంగా ప్రవేశపెట్టిన ఘనత మాత్రం ఈస్టిండియా కంపెనీ వారికే దక్కింది. వారు ఆదాయం కోసం చేస్తే, అది మాత్రం తిరుమలకు చిరునామాగా నిలిచిపోయింది. అందుకే అంటారు ఏం జరిగినా మన మంచికే అని.

### 1200 ఏళ్ళ పూర్వమే తితిదే

తితిదే-తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల, దిగువ తిరుపతిలలోని ఆలయాలను నిర్వహించే సంస్థ. తిరుపతిలోనే కాక, అక్కడి దగ్గరలోని మరెన్నో ఆలయాలను నిర్వహిస్తోంది తితిదే. ఈ ఆలయాల పూర్తి బాధ్యత ఈ సంస్థదే. తితిదే 1933లో ప్రారంభమైన ఈ సంస్థ 1200 ఏళ్ళ నుండీ ఉండడమేమిటి అనుకుంటున్నారా. క్రీ.శ 800 సంవత్సరానికి పూర్వమే అచ్చంగా తితిదేలానే కాకపోయినా తిరుమల, తిరుపతి, తిరుచానూరులోని అనేక ఆలయాలను నిర్వహించేందుకు ఒక సంస్థ ఉండేది. దాని పేరే "శ్రీ వైష్ణవ సభ".

1978లో అప్పటి తిరుమల-తిరుపతి దేవస్థానాల పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారు తిరుమల, దిగువ తిరుపతి, తిరుచా నూరులలో దొరికిన శిలాశాసనాలను సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ఆధ్వర్యంలో పరిష్కరించి, పరిశోధనలు జరిపారు. మొత్తం 1252 శాసనాలు దొరకగా అందులో ఎక్కువ శాతం తమిళంలోనూ, అతికొద్దిగా సంస్కృతంలోనూ, కన్నడంలోనూ ఉండగా, కేవలం 6 తెలుగు శాసనాలు ఉన్నాయి. వీటిలో మొదటది క్రీస్తు శకం 800 సంవత్సరానికి చెందినది.



ఒక భక్తుడు కొండమీద వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తి ముందు దీపం పెట్టేందుకు దానంగా 30 కళంజుల బంగారాన్ని తిరుచానూరులోని శ్రీ వైష్ణవ సభ వారికి సమర్పించినట్టుగా రాసిన శాసనం అది. తరువాత దొరికిన శాసనం క్రీస్తు శకం 935 సంవత్సరంలోనిది.

మలైనాడుకు చెందిన కొడుంగోలూరన్ అనే భక్తుడు తిరుమలలో అఖండదీపం కోసం 40 కళంజుల బంగారాన్ని వైష్ణవ సభకు సమర్పించినట్టుగా దాన శాసనం అది. ఈ రెండు శాసనాల ద్వారా తెలిసేది ఏమిటి అంటే ఇప్పుడు తితిదే లాగా అప్పట్లో తిరుమల ఆలయాన్ని నిర్వహించేందుకు తిరుచానూరులో శ్రీ వైష్ణవ సభ అనే సంస్థ ఉండేదని, భక్తులు ఇవ్వదలచిన కానుకలు భూముల రూపంలోనో, నగల రూపంలోనో, లేదా నగదు రూపంలోనో ఈ వైష్ణవ సభకే సమర్పించాలని తెలుస్తోంది.

ఈ సంస్థ తిరుచానూరు నుంచి కార్యకలాపాలు నిర్వహించేది. ఆ నాటికి తిరుమల కొండపైన ఏ విధమైన సౌకర్యాలూ లేకపోవడంతో, పూర్తిగా అడవి కావడంతో, పైన ఎవరూ నివాసం ఉండేవారు కాదు. యాత్రికులూ, అర్చక స్వాములూ కూడా ఉదయమే కొండ ఎక్కి స్వామిని సేవించుకుని, రాత్రికి కిందకి వచ్చేసేవారు. కొందరు రాజులూ, ధనికులు, గుంపులుగా వచ్చిన భక్తులు మాత్రం తాత్కాలికంగా గుడారాలు ఏర్పాటు చేసుకుని రెండు, మూడు రోజులుండేవారే తప్ప, పైన ఎటువంటి ఆవాసాలూ ఉండేవి కావు. దాంతో ఈ ఆలయాన్ని నిర్వహించే శ్రీ వైష్ణవ సభ కూడా తిరుచానూరు నుండే పని చేసేది. ఈ వైష్ణవ సభలో 108 సభ్యులు ఉండేవారు.

### ఏడాదికి 9 బ్రహ్మోత్సవాలు చేయించుకున్న ఏడుకొండలవాడు

శ్రీకృష్ణదేవరాయల కాలానికి పూర్వం నుంచీ ఏడాదిలో 9 బ్రహ్మోత్సవాలు నిర్వహించేవారు. అందులో ఏడు ఉత్సవాలు వేంకటేశ్వరస్వామికి నిర్వహించగా, మిగిలిన రెండు నెలల్లో, నెలకొకటి చొప్పున రెండు ఉత్సవాలు తిరుపతిలోని గోవిందరాజస్వామివారికి నిర్వహించేవారు. ఐతే ఆ 7 బ్రహ్మోత్సవాలలో ఏ ఒక్కటీ పూర్తిగా కొండ మీద జరిగేది కాదు. అంకురార్పణ, ధ్వజారోహణ మాత్రం కొండపై ఆలయంలో జరిగేవి.

ధ్వజారోహరణ అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా, కొండ కింద ఉన్న తిరుచానూరుకు తీసుకువచ్చి, అక్కడే వాహనోత్సవాలు, స్నపన తిరుమంజనం వంటి ఉత్సవాలు చేసేవారు. తొమ్మిదవ రోజున అవభృత స్నానం పూర్తి అయ్యాకా, తిరిగి తిరుమల ఊరేగింపుగా తీసుకువెళ్ళేవారు. అక్కడ ధ్వజ అవరోహణం, ప్రాయశ్చిత్తం చేసి, ఆఖరి రోజున పుష్ప యాగం చేసేవారు.

రామానుజులు తిరుమల వచ్చాకా చేసిన అనేక మార్పుల్లో ముఖ్యమైనది, తిరుమలను ఆవాస యోగ్యంగా మార్చడం. ఆలయ ప్రాకారానికి నాలుగు వైపులా మాడ వీధులు, ఆలయం ముందు సన్నిధి వీధి నిర్మించాడు. కొండపైనే అర్చక స్వాములకు, ఆచార్య పురుషులకు, ఆలయ అధికారులకు నివాసాలు ఏర్పాటు చేయించాడు. అలా బ్రహ్మోత్సవాలు, ఇతర ఉత్సవాలూ కూడా తిరుమలకే చేరుకున్నాయి. అప్పటి నుంచి, ఇప్పటి వరకూ కూడా అన్ని వాహన సేవలూ ఆయన ఏర్పాటు చేసిన మాఢ వీధులలోనే జరుగుతున్నాయి.

అయితే అప్పట్లో బ్రహ్మోత్సవాల ఆఖరి రోజున పుష్ప యాగం జరిగేది. కానీ అది ఈస్టిండియా కంపెనీ వారి పాలనలో రద్దు చేయబడింది. ఆ తరువాత 1980లో అప్పటి తితిదే కార్యనిర్వాహణాధికారి పి.వి.ఆర్.కె.ప్రసాద్ ఆధ్వర్యంలో తిరిగి పుష్ప యాగాన్ని ప్రారంభించినా, అది స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల తరువాత చాలా ముఖ్యమైన ఉత్సవాలు వసంతోత్సవం, పవిత్రోత్సవం. ఈ రెండూ 14, 15 శతాబ్దాలలో ప్రారంభమైనట్టు ఆధారాలున్నాయి. సాళువ నరసింహ రాయలు దగ్గర బంధువైన సాళువ మల్లదేవ మహారాయలు ఈ ఉత్సవాలను ప్రారంభించాడు. వసంతోత్సవాన్ని 3 రోజులు, పవిత్రోత్సవాన్ని 5 రోజులూ చేస్తారు. ఇవి కూడా కంపెనీ వారి కాలంలో ఆగిపోయి, తిరిగి 20వ శతాబ్దంలో ప్రారంభయ్యి, ఇప్పటికీ కొనసాగు తున్నాయి.

### శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్

1978 నుంచి 1982 వరకూ తిరుమల తిరుపతి దేవ స్థానముల కార్యనిర్వాహణాధికారిగా పనిచేసిన మాజీ ఐ.ఎ.ఎస్ అధికారి కీర్తిశేషులు శ్రీ పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారు తిరుమల ఆలయానికి ఎంతో సేవ చేసారు. మాస్టర్ ప్లాన్ అమలు చేసి, మనం ఇప్పుడు చూస్తున్న విశాలమైన తిరుమాడ వీధులు గల ఆలయంగా తిరుమలను తయారు చేసినవారు ఈయనే. తితిదే నిర్వహిస్తున్న గొప్ప కార్యక్రమాలలో ఒకటైన నిత్యాన్నదానాన్ని ప్రారంభించింది ప్రసాద్ గారే. ఆయన తిరుమలలో తన అనుభవాలను సర్వసంభవాం(నాహం కర్తా హరిః కర్తా) అనే పుస్తకం ద్వారా వెల్లడించారు. అలాగే తిరుమల లీలామృతంలో పురాణాలలో తిరుమల ప్రస్తావన, విశిష్టతల గురించీ, తిరుమల చరితామృతంలో చారిత్రికంగా తిరుమల ఆలయ విశేషాలనూ రాశారు. ఆ తిరుమల చరితామృతం పుస్తకంలో నేను చదివిన కొన్ని ఆసక్తికరమైన అంశాలనే ఈ ప్రశ్నకు సమాధానంగా రాశాను.

---

# ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు.. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. 'అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే దీనికి ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతో పాటు మారుమూల ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి. మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి.. జన జీవన స్రవంతిలోకి వచ్చిన అనేకమందిని మనం ఇటీవల చూశాం అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఇది ఒక గొప్ప విజయం అని పేర్కొన్నారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ జీఎస్టీ రేట్ల తగ్గింపు కారణంగా ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ది చేకూరుతుందన్నారు. ఇక, పౌరులు స్థానిక ఉత్పత్తులను



ప్రోత్సహించాలని మోదీ పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి.. యోగాను ఆచరిద్దామన్నారు. ఈ ప్రయత్నాలన్నీ.. మనల్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయన్నారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శు భాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు.

అంతే కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. ఇక భారత్, ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన సైతం కల్పించుకోవాలని కోరారు.



# ప్రజల కోసం బస్తీ దవాఖానాలను ప్రారంభించిన తొలి సీఎం కేసీఆర్

## వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 21. (అక్షర గళం):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా బస్తీ దవాఖానాలను ప్రజల కోసం ప్రారంభించారని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. మంగళవారం వివేకానంద నగర్ డివిజన్ వెంకటేశ్వర్ నగర్ లోని బస్తీ దవాఖానాను స్థానిక నాయకులు బస్తీ వాసులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మాట్లాడుతూ, దవాఖానాలో ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులకు గత ఆరు నెలలుగా జీతాలు సక్రమంగా అందడం లేదని, అలాగే ప్రజలకు అవసరమైన మందులు, ల్యాబ్ రిపోర్ట్ తీసుకురావడానికి సంబంధించిన రవాణా ఖర్చుల బిల్లు హాస్పిటల్ కి సంబంధించిన మెయింటెనెన్స్ బిల్లులు చాలా కాలంగా రావడం లేదని పేర్కొన్నారు. జీతాలు రాక బిల్లులు రాక హాస్పిటల్ స్టాఫ్ ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కెసిఆర్ మీద కోపం తోటి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డాక్టర్లకి జీతాలు ఇవ్వక ట్రాన్స్పోర్ట్ ,మెయింటనెన్స్ డబ్బులు ఇవ్వక బస్తి దవఖానాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారన్నారు.

ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యాలని దృష్టిలో పెట్టుకొని వెంటనే డాక్టర్లకు జీతాలను ఇవ్వాలని మెయింటెనెన్స్ డబ్బులు రవాణాకు సంబంధించిన డబ్బులు చెల్లించాలని ఏవైతే మందులు లేవు అవి అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నఖ్వీపై చర్యలు తీసుకోనున్న బీసీసీఐ

ఆసియా కప్ ముగిసి చాలా కాలమైంది. ఇంత వరకు ట్రోఫీ మాత్రం భారత్‌కు రాలేదు. తన చేతుల మీదుగా తీసుకోలేదని మొండికేసిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ భారత్‌కు ట్రోఫీ ఇచ్చేందుకు అంగీకరించలేదు. తనతోపాటే తీసుకెళ్లిపోయారు. దీంతో ఈ వివాదం ఇంకా ముగిసిపోలేదు. భారత్ పలు రకాలుగా ఆయన్ని సంప్రదిస్తుంటే షరతులతో ఇచ్చేందుకు అంగీకరించారు. తన చేతుల మీదుగా తీసుకుంటేనే ఇస్తానని చెబుతున్నారు. దీంతో భారత్ మరిన్ని చర్యలు సిద్ధమవుతోంది. ట్రోఫీ వివాదంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో, బీసీసీఐ తదుపరి ఐసీసీ సమావేశంలో ఈ విషయంలో అంతర్జాతీయ బోర్డు జోక్యం చేసుకోవాలని కోరవచ్చు. బీసీసీఐ గత వారంలో ఒక లేఖను పంపిందని సమాచారం, అందులో ట్రోఫీని భారత జట్టుకు ఇవ్వాలని కోరారు, అయితే నఖ్వీ నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. టీమ్ ఇండియాకు ట్రోఫీని ఇవ్వాలి లేదా త్వరలో జరగనున్న ఐసీసీ సమావేశంలో ఈ సమస్యను లేవనెత్తుతామని బీసీసీఐ స్పష్టం చేసింది. ఏషియా కప్ ట్రోఫీ ప్రస్తుతం దుబాయ్‌లో ఉంది, అక్కడ అది ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ కార్యాలయంలో ఏసీసీ ఉంచారు. ఒక మీడియా నివేదికలో, బీసీసీఐకార్యదర్శి దేవ్జిత్ సైకియా మాట్లాడుతూ, భారత బోర్డు చట్టపరంగా ఒక్కో అడుగు వేస్తోందని చెప్పారు. ఏషియా కప్ ఫైనల్‌లో భారత జట్టు పాకిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించిన తర్వాత మొహ్సిన్ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోడానికి నిరాకరించడంతో ఈ వివాదం ప్రారంభమైంది. కొంత సమయం తరువాత, మొహ్సిన్ నక్వీ ట్రోఫీని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొన్ని వారాల క్రితం సెప్టెంబర్ 30న ఏసీసీ సమావేశం జరిగింది, ఆ సమావేశంలో రాజీవ్ శుక్లా భారతదేశానికి ప్రతినిధిగా ఉన్నారు, అతను ప్రస్తుతం బీసీసీఐ ఉపాధ్యక్షుడు కూడా. ఆ సమావేశంలో రాజీవ్ శుక్లా మాట్లాడుతూ ట్రోఫీ



ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ఆస్తి అని, కాబట్టి నఖ్వీ వ్యక్తిగతంగా ట్రోఫీని మైదానం నుంచి తీసుకెళ్లే హక్కు లేదని అన్నారు. బోర్డు సభ్యుల ముందు క్షమాపణ చెప్పిన తర్వాత కూడా, అతను టీమ్ ఇండియాకు ట్రోఫీని ఇవ్వడానికి నిరాకరించాడు. టీమ్ ఇండియా ట్రోఫీని తీసుకెళ్లాలనుకుంటే, వారు నేరుగా దుబాయ్‌లోని కార్యాలయానికి వచ్చి అతని చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోవాలని ఆయన షరతులు పెడుతున్నారు. వీటికి టీమిండియా, బీసీసీఐ అంగీకరించడం లేదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ అమాయకులైన ప్రజలను పొట్టన పెట్టుకుంటుందని, జమ్ముకశ్మీర్‌లో జరిగిన దాడులు ఉదాహరణగా చూపిస్తూ ఆసియా కప్‌లో పాకిస్తాన్ క్రికెటర్లతో మాట, చేతులు కలపడానికి నిరాకరించింది. అంతేకాకుండా ఆ దేశానికి చెందిన నఖ్వీ చేతుల మీదుగా కూడా ట్రోఫీ అందుకోలేదు. దీన్ని మనసులో పెట్టుకొనే నఖ్వీ తనకు నచ్చినట్టు చేస్తున్నారు. ట్రోఫీని భారత్‌కు ఇవ్వకుండా అడ్డం పడుతున్నారు.

# రోహిత్, కోహ్లీలతో నా రిలేషన్ మారలేదు

## వన్డే కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్



రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో తనకున్న రిలేషన్ గురించి వన్డే కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్ స్పందించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో తన రిలేషన్ గతంలోలాగే ఉందని, తనకు ఏ అవసరం వచ్చినా ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లను సంప్రదించడానికి వెనుకాడనని గిల్ తెలిపాడు. సోషల్ మీడియాలో ఇటీవల వస్తున్న కథనాలపై ఈ విధంగా స్పందించాడు. భారత వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఎంతో విజయవంతమైన రోహిత్ శర్మ స్థానాన్ని గిల్ భర్తీ చేశాడు. అప్పటి నుంచి ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు రోహిత్, కోహ్లీల భవిష్యత్తుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆదివారం పెర్త్ వేదికగా ప్రారంభం కానున్న ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల సిరీస్ భారత వన్డే కెప్టెన్‌గా గిల్ తొలి సిరీస్.స్వాన్ నది ఒడ్డున మ్యాచ్‌కు ముందు మీడియా సమావేశానికి హాజరుకావడం చాలా అసాధారణం. "బయట ఒక విషయం నడుస్తోంది, కానీ రోహిత్‌తో నాకున్న రిలేషన్‌లో ఏమీ మారలేదు. నేను ఏదైనా అడగాలనుకుంటే, సలహా కోరాలని భావిస్తే కచ్చితంగా రోహిత్‌ను సంప్రదిస్తాను. పిచ్ స్వభావం గురించి సలహా కావాలన్నా, మ్యాచ్ గురించి అయినా రోహిత్ సహాయం చేస్తాడు" అని సిరీస్ ప్రారంభానికి ముందు గిల్ అన్నాడు. "నాకు విరాట్ భాయ్, రోహిత్ భాయ్‌లతో మంచి అనుబంధం ఉంది. నేను వెళ్లి ఈ పరిస్థితుల్లో కెప్టెన్ అయితే మీరేం చేస్తారు, ఎలాంటి నిర్ణయం తీసుకుంటారని నిర్మొహమాటంగా అడుగుతాను. సలహాలు ఇవ్వడానికి వారిద్దరూ ఎప్పుడూ వెనుకాడరు. 25 ఏళ్ల కెప్టెన్‌ను. నామీద పెద్ద బాధ్యత ఉంది. ఇద్దరు మాజీ కెప్టెన్ల నుండి చాలా మద్దతు అవసరం. టీమ్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, ఏ రకంగా నిర్ణయాలు తీసుకుని జట్టును ముందుకు తీసుకెళ్లాలనే దానిపై విరాట్ భాయ్, రోహిత్ భాయ్‌లతో నేను చాలాసార్లు మాట్లాడాను. వారి అనుభవాలు మాకు సహాయపడతాయి' అని గిల్ పేర్కొన్నాడు. "మహీ భాయ్ (ఎంఎస్ ధోని), విరాట్, రోహిత్ అందించిన వారసత్వం, ఎన్నో అనుభవాల నుంచి నేర్చుకున్న విషయాలు చాలా ఉన్నాయి. వారి అనుభవం, నైపుణ్యం చాలా గొప్పది. వారి ఆట చూస్తూ పెరిగాను. వారిని నేను ఆరాధించేవాడిని, అది నన్ను ప్రేరేపిస్తుంది. అలాంటి దిగ్గజాలు నా సారథ్యంలో ఆడటం గొప్ప గౌరవంగా భావిస్తాను. జట్టుకు ఏ విధంగా మెస్సేజ్ ఇవ్వాలి. ఆటగాళ్లలో ఎలా కమ్యూనికేషన్ జరపాలి అనే విషయంపై రోహిత్, కోహ్లీలను అడిగి తెలుసుకున్నాను. వారితో కలిసి ఆడినప్పుడు కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఆస్ట్రేలియాతో సిరీస్ లో వారు ప్రత్యేకంగా నిలుస్తారు. రోహిత్, కోహ్లీలు దాదాపు 20 సంవత్సరాలుగా భారత క్రికెట్‌కు సేవలందించారు. వారి అనుభవాన్ని రిపీట్ చేయలేం. కానీ వ్యక్తిగతంగా, తనపై ఎంత ఎక్కువ బాధ్యత ఉంటే, అంత బాగా ఆడతానని నమ్ముతాను. కెప్టెన్సీ అనే అదనపు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తాను.నేను ఒత్తిడిలో రాణిస్తాను, నా అత్యుత్తమ ఆట బయటకు వస్తుంది. బ్యాటింగ్ చేసినప్పుడు బ్యాటర్‌గా ఆలోచిస్తాను, ఆపై బెస్ట్ నిర్ణయం నిర్ణయాలు తీసుకుంటాను. ఒక బ్యాటర్‌గా, నేను కెప్టెన్‌లా ఆలోచించడానికి మాత్రం ప్రయత్నించను. అలా చేస్తే ఒత్తిడి పెరుగుతుంది. దాంతో స్వేచ్ఛగా ఆడలేం. మన అత్యుత్తమ ఆట ప్రదర్శించలేమని" ఆసీస్ తో వన్డే సిరీస్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ భారత వన్డే కెప్టెన్ గిల్ కీలక విషయాలు వెల్లడించాడు.

# అడిలైడ్‌లో కోహ్లీ రాణించేనా..?



పునరాగమనంలో డకౌట్‌తో తీవ్రంగా నిరాశపర్చిన విరాట్ కోహ్లీ.. మరో కీలక పోరుకు సిద్ధమయ్యాడు. అచ్చొచ్చిన మైదానంలో ప్రత్యర్థికి చుక్కలు చూపించేందుకు రెడీ అవుతున్నాడు. నాలుగున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ.. పెర్త్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్ డకౌటయ్యాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా డక్ వర్త్ లూయిస్ పద్దతిన 7 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. అడిలైడ్ వేదికగా గురువారం రెండో వన్డే జరగనుంది. ఈ సిరీస్‌లో నిలవాలంటే టీమిండియా ఈ మ్యాచ్ గెలవాలి. లేదంటే మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కోల్పోతుంది. అడిలైడ్ వన్డే గెలవాలంటే కోహ్లీతో పాటు రోహిత్ శర్మ రాణించాలి. అయితే అడిలైడ్‌లో కోహ్లీ రికార్డ్స్ బాగున్నాయి.

అడిలైడ్ వేదికగా మూడు ఫార్మాట్లలో కలిపి 15 ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ.. 65 సగటుతో 975 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలతో పాటు 4 శతకాలు ఉన్నాయి.ఇక్కడ ఇప్పటి వరకు 4 వన్డేలు ఆడిన కోహ్లీ 61 సగటుతో 244 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. దాంతో కోహ్లీ నుంచి మరో సెంచరీ వస్తుందని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అడిలైడ్ వేదికగా అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కూడా కోహ్లీ కొనసాగుతున్నాడు. 975 పరుగులతో అతను టాప్ స్కోరర్‌గా నిలవగా.. సర్ డాన్ బ్రాడ్‌మన్ (970), స్టీవ్ స్మిత్(934), గ్రేగ్ చాపెల్(747), షేన్ వాట్సన్(729), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (687) తర్వాతి స్థానాల్లో కొనసాగు తున్నారు. ఈ జాబితాలో బ్రాడ్‌మన్ మినహా మిగతా బ్యాటర్లంతా కోహ్లీ కంటే ఎక్కువ ఇన్నింగ్స్ ఆడారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25లో భాగంగా అడిలైడ్ వేదికగా చివరిసారిగా ఆడిన కోహ్లీ.. ఈ డే/నైట్ టెస్ట్‌లో తీవ్రంగా నిరాశపర్చాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో 7, 11 పరుగులు మాత్రమే చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న కోహ్లీ, రోహిత్‌లకు ఈ మ్యాచ్ అగ్ని పరీక్షగా మారింది. ఈ మ్యాచ్‌లో రాణిస్తేనే వారిపై ఒత్తిడి తగ్గనుంది. లేదంటే విమర్శలు రెట్టింపు అవుతాయి.



# బ్రాడ్ ఎవాన్స్ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు

జింబాబ్వే ఆల్ రౌండర్ బ్రాడ్ ఎవాన్స్ టెస్ట్ క్రికెట్‌లో కొత్త రికార్డు సృష్టించాడు. కేవలం 9.3 ఓవర్లలోనే 5 వికెట్లు పడగొట్టాడు. జింబాబ్వే టాస్ గెలిచి ఆఫ్ఘనిస్తాన్‌పై బౌలింగ్ ఎంచుకుంది. దీని ప్రకారం, మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ జట్టు మంచి ఆరంభాన్ని ఇచ్చింది. కానీ 77 పరుగుల వద్ద 2వ వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్స్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఫలితంగా, ఆఫ్ఘనిస్తాన్ జట్టు మొదటి



ఇన్నింగ్స్‌లో 127 పరుగులకు ఆలౌట్ అయింది. ఆఫ్ఘనిస్తాన్ జట్టు తక్కువ స్కోరు సాధించడానికి ప్రధాన కారణం బ్రాడ్ ఎవాన్స్. ఈ మ్యాచ్‌లో ఇవాన్స్ 57 బంతులు వేసి కేవలం 22 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో పాటు, జింబాబ్వే తరపున ఒక టెస్ట్ మ్యాచ్‌లో అత్యల్పంగా 5 వికెట్లు తీసిన రికార్డును కూడా అతను సృష్టించాడు. గతంలో ఈ రికార్డు జింబాబ్వే మాజీ కెప్టెన్ హీత్ స్ట్రీక్ పేరిట ఉండేది. 2001లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో స్ట్రీక్ 27 పరుగులకు 5 వికెట్లు పడగొట్టాడు. దీనితో, జింబాబ్వే తరపున ఒక టెస్ట్‌లో అతి తక్కువ పరుగులకు ఐదు వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.24 సంవత్సరాల క్రితం నెలకొల్పిన రికార్డును బ్రాడ్ ఎవాన్స్ ఇప్పుడు బద్దలు కొట్టాడు. ఆఫ్ఘనిస్తాన్‌పై కేవలం 22 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి అతను కొత్త చరిత్ర సృష్టించాడు. దీనితో, జింబాబ్వే తరపున అతి తక్కువ పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీసిన బౌలర్‌గా బ్రాడ్ ఎవాన్స్ నిలిచాడు.

# టీమ్ ఇండియాకు చివరి ఛాన్స్

ఉమెన్స్ వన్డే వరల్డ్‌కప్‌లో ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది. ఇప్పటికే మూడు జట్లు సెమీస్ బర్త్ ఖాయం చేసుకున్నాయి. ఇక మిగిలిన ఒక స్థానం కోసం ఐదు జట్ల మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. ఈ క్రమంలో వరుసగా మూడు పరాజయాలు ఎదుర్కొన్న టీమ్‌ఇండియా మహిళల జట్టు తన సెమీస్ అవకాశాలను క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టుకుంది. టీమ్‌ఇండియా ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో 2 గెలిచి, 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఇక ముందున్న రెండు మ్యాచ్‌లు భారత్‌కు అత్యంత కీలకం. అక్టోబర్ 23న న్యూజిలాండ్‌తో, అక్టోబర్ 26న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. సెమీఫైనల్ ఆశలను నిలబెట్టుకోవాలంటే ఈ రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సిందే! ఒక మ్యాచ్ గెలిచి, మరోదాంట్లో ఓడినా టీమ్‌ఇండియాకు ఇంకా అవకాశం ఉంది! కానీ అది పూర్తిగా రేసులో ఉన్న ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ఆ జట్ల కంటే మెరుగైన నెట్ రన్‌రేట్ సాధిస్తేనే భారత్ సెమీస్ బరిలో నిలుస్తుంది. అయితే, రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి చవిచూస్తే సెమీస్ కల దాదాపు చెదిరినట్టే!ఇక టీమ్‌ఇండియాకు ఒక్క సానుకూల అంశం ఏంటంటే రన్‌రేట్ పాజిటివ్‌గా ఉండటం. న్యూజిలాండ్ ఇప్పటివరకు ఒకే మ్యాచ్‌లో విజయం సాధించినా, మరో రెండు మ్యాచ్‌ల ఫలితాలు తేలకపోవడంతో వారి ఖాతాలో నాలుగు పాయింట్లు చేరాయి. అయితే కివీస్ తమ తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే మాత్రం భారత్‌ను వెనక్కి నెట్టి సెమీస్ రేసులో ముందంజలోకి వచ్చేయొచ్చు! సోమవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక విజయం సాధించింది. ఈ విజయం త శ్రీలంక ఖాతాలో 4 పాయింట్లు చేరాయి. చివరి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై గెలిస్తే, శ్రీలంక కూడా సెమీస్ రేసులోకి చేరే అవకాశం ఉంది. పాయింట్ల పట్టికలో చివరి స్థానాల్లో ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్ జట్లు సెమీస్ రేస్ నుంచి దాదాపు వెలుపలే ఉన్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా మాత్రం నాలుగేసి మ్యాచ్‌ల్లో విజయం సాధించి సెమీస్‌కు సులభంగా అడుగుపెట్టేశాయి. టీమ్‌ఇండియా మహిళా క్రికెట్ జట్టు వరుస మ్యాచ్‌ల్లో ఓటమి గ్యాప్‌లో ఉంది. కానీ, ఆ తప్పుల నుంచి సరైన పాఠం నేర్చుకోవడం లేదు. చివరివరకు పోరాటంలో తడబడుతూ, చేతిలో ఉన్న విజయాలను ప్రత్యర్థులకు ఇచ్చేస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లో కూడా ఇదే దృశ్యం. వన్డే ప్రపంచకప్ కీలక దశ చేరుకోవడం దగ్గరగా ఉన్న సమయంలో, హర్మన్‌ప్రీత్ సేన తక్షణమే వ్యూహాలను మార్చాలి. చివరి వార్షికం వరకు గట్టిగా పోరాటం చేస్తేనే జట్టు విజయాల మార్గంలో అడుగులు వేస్తుంది.

# రొటీన్‌కు భిన్నంగా సాగిన థామా

'స్త్రీ', 'భేడియా', 'ముంజ్యా', 'స్త్రీ 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక హారర్ యూనివర్స్‌ను సృష్టించుకుంది ప్రముఖ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిల్మ్స్. ఇప్పుడీ హారర్ యూనివర్స్‌లోకి రష్మిక - ఆయుష్మాన్ ఖురానాలను తీసుకొచ్చి 'థామా సినిమాను తీర్చిదిద్దింది. అలోక్ గోయల్ (ఆయుష్మాన్ ఖురానా) ఓ జర్నలిస్ట్. ఒకరోజు మిత్రులతో కలిసి ఓ పర్వత ప్రాంతానికి న్యూస్ కవరేజ్‌కి వెళ్తాడు. అక్కడ అతనిపై ఓ ఎలుగుబంటి దాడి చేయగా.. తడ్కా (రష్మిక) తనని కాపాడుతుంది. ఆమె బేతాళ జాతికి చెందిన యువతి. మనుషుల రక్తాన్ని తాగే అలవాటున్న వాళ్లకు.. ఎన్నో అతీత శక్తులుంటాయి. ఈ జాతికి నాయకుడు థామాగా పిలిచే యక్షాసన్ (నవాజుద్దీన్ సిద్ధిఖీ). అతను చేసిన ఓ తప్పు కారణంగా బేతాళ జాతి అతడిని ఎన్నో దశాబ్దాలుగా ఓ గుహలో బందీగా ఉంచుతుంది. అలాంటి బేతాళ సామ్రాజ్యంలోకి అలోక్ వచ్చాడని తెలిసి.. ఆ జాతి వాళ్లు అతడిని శిక్షించే ప్రయత్నం చేయగా.. తడ్కా తప్పిస్తుంది. ఈ క్రమంలోనే అతనిపై ప్రేమతో తన జాతిని విడిచి జనజీవనంలోకి వస్తుంది. మరి ఆ తర్వాత వీళ్ల ప్రేమ ప్రయాణం ఎన్ని మలుపులు సాగింది? అలోక్‌కు తడ్కా ఓ బేతాళిని అని ఎప్పుడు తెలిసింది? ఆమె బేతాళ జాతి పుట్టుక వెనకున్న కారణమేంటి? ఏ తప్పు చేయడం వల్ల యక్షాసన్ దశాబ్దాలుగా గుహలో బందీగా ఉండాల్సి వచ్చింది? తను బయటకి వచ్చాక ఏం జరిగింది? ఈ కథకు 'భేడియా', 'ముంజ్యా', 'స్త్రీ 2' చిత్రాలతో ఉన్న లింకేంటి? అన్నది మిగిలిన కథ.

మన జానపదాల్లో ఎన్నో బేతాళ కథలున్నాయి. కాకపోతే ఆ జాతి నేపథ్యమేంటి? అదెలా ఆవిర్భవించింది? అన్నది ఎవరికీ పెద్దగా తెలిసి ఉండకపోవచ్చు. ఈ పాయింట్‌ను ఆధారం చేసుకునే ఓ ఫిక్షనల్ హారర్ ఫాంటసీ కథను సిద్ధం చేసుకుంది ఈ చిత్ర బృందం. అయితే ఇది హారర్ జానర్‌లో సాగే చిత్రమైనా దీంట్లో భయం కన్నా ప్రేమకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. ఆద్యంతం ఓ విభిన్నమైన ప్రేమకథను చూస్తున్న అనుభూతినే పంచుతుంది. దేశంపై దండెత్తడానికి వచ్చిన అలెగ్జాండర్‌ను బేతాళ నాయకుడు యక్షాసన్ అంతమొందించే హారర్ సీక్వెన్స్‌తో సినిమాని ఆరంభించిన తీరు ఆసక్తికరంగా ఉంటుంది. ఆ వెంటనే హీరో పరిచయ సన్నివేశాలతో కథను వర్తమానంలోకి తీసుకొచ్చాడు దర్శకుడు. ఎలుగు బంటి దాడి నుంచి హీరోను కాపాడే ఎపిసోడ్‌తో రష్మిక పాత్రని కథలోకి తీసుకొచ్చిన తీరు.. ఆ తర్వాత వాళ్లిద్దరికీ మధ్య చిగురించే ప్రేమకథ రొటీన్ రొమాంటిక్ లవ్‌ట్రాక్‌లాగే అనిపిస్తాయి. హీరోని



బేతాళ జాతి బందీ చేయడం.. వాళ్లు అతన్ని యక్షాసన్‌కు ఆహారంలా గుహలోకి పంపడం.. అక్కడ తనకెదురయ్యే అనుభవాలు ఉత్సుకతరేకెత్తిస్తాయి. నాయకా నాయికలిద్దరూ అక్కడి నుంచి తప్పించుకుని జనజీవనంలోకి వచ్చినప్పటి నుంచి కథలో నవ్వులు మొదలవుతాయి. ముఖ్యంగా తడ్కా బేతాళిని అని.. రక్తం తాగుతుందని తెలిశాక.. ఆ విషయం ఇంట్లో వాళ్లకు తెలియకుండా దాచి పెట్టేందుకు హీరో పడే తిప్పలు ఫన్నీగా ఉంటాయి. ఇక రౌడీలకు బుద్ధి చెప్పే క్రమంలో బేతాళినిగా రష్మిక విజృంభించే తీరు.. ఈ క్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ద్వితీయార్థంపై ఆసక్తిరేకెత్తించేలా చేస్తాయి. ఓవైపు హీరో కూడా బేతాళుడిగా మారడం.. మరోవైపు అతన్ని పట్టుకునేందుకు బేతాళ జాతి వ్యక్తులు రంగంలోకి దిగడం.. మరోవైపు రష్మిక చేసిన ఓ తప్పు వల్ల గుహలో బందీగా ఉన్న యక్షాసన్ బయటకు రావడం కథలో సంఘర్షణని రెట్టింపు చేస్తాయి. ఇక ఈ కథలోకి భేడియాగా వరుణ్ పాత్రను తీసుకొచ్చిన తీరు.. ఆ పాత్రకు హీరోకి మధ్య ముడిపెట్టిన వైరం థ్రిల్ పెంచేలా ఉంటాయి. ఈక్రమంలోనే తను దేవీ అనుగ్రహంతో థామాగా మారడం కాస్త సినిమాటిక్‌గా ఉంటాయి. మొత్తంగా కథ గమ్మత్తుగా మొదలై గమ్మత్తుగా ముగియడం విశేషం. రష్మక, ఆయుష్మాన్ ఖురానాలు పోటీపడి నటించారు.




## నవీన్ పోలిశెట్టి...అనగనగా ఒక రాజు

జాతిరత్నాలు తరువాత మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాతో వచ్చాడు. ఇక ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇక దాని తరువాత నవీన్ నటిస్తున్న చిత్రం అనగనగా ఒక రాజు. కొన్ని కారణాల వలన ఆగుతూ వచ్చింది. మారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నాడు. మొదట ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తుంది అని చెప్పారు. ఆ తరువాత ఆమె ప్లేస్ ను మీనాక్షీ చౌదరి రీప్లేస్ చేసింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, వీడియోలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక నవీన్ తన సినిమాకు ఏ రేంజ్ లో ప్రమోషన్స్ చేస్తుందో అన్న విషయం అందరికీ తెల్సిందే. ముఖ్యంగా అనగనగా ఒక రాజు సినిమా ప్రమోషన్స్ భాద్యత మొత్తం నవీన్ తన భుజాల మీద వేసుకున్నాడు. ప్రతి పండగకు అందరూ తమ సినిమావైపు తిరిగి చూసేలా ప్రమోషన్స్ చేస్తాడు. మొన్న దసరాకు ప్లలెటూరు వెళ్ళి అక్కడున్నవారితో సినిమా గురించి మాట్లాడి దసరా శుభాకాంక్షలు చెప్పించాడు. ఇప్పుడు దీపావళీకి కూడా మరో కొత్త కాన్సెప్ట్ తో వచ్చేశాడు. దీపావళీ టపాకాయలు అమ్ముతూ తన సినిమా గురించి చెప్పుకొచ్చాడు. అనగనగా ఒక రాజు ఫుల్ ఎంటర్ టైన్మెంట్. దీపావళీ నుంచి సంక్రాంతి వరకు ఇది పేలుతూనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. అంతే కాకుండా అనగనగా ఒక రాజు నుంచి మొదటి సాంగ్ ను త్వరలోనే రిలీజ్ కానుందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. ఇక ఈ ప్రమోషన్స్ చూసి .. నిజంగా నవీన్ జాతిరత్నం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14 న ఈ సినిమా ప్రేక్షకుల ముందకు రానుంది. మరి ఈ సినిమాతో రాజుగారు ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.


## శృతి మించుతున్న సోషల్ మీడియా

### హీరోయిన్ల పెళ్లిళ్లపై అసత్య ప్రచారాలు

సోషల్ మీడియ ఆప్రచారంతో ఒక్కోసారి సినీతారల జీవితాలు ప్రమాదంలో పడుతుంటాయి. ముఖ్యంగా పెళ్లి విషయంలో ఇది ఎతంగానో వారి వ్యక్తిగత జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. ఇదేదీ పట్టించుకోకుండా విమర్శకులకు దీనిని ఎంజాయ్ చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల తీరు కారణంగా ఇప్పుడు హీరోయిన్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. సత్యమిది. ప్రజలను ఎక్కువగా ఆకర్షించేవి సినిమాలు, రాజకీయాలు. సామాజిక మాధ్యమాల వేదికగా వీటిపై చర్చకు అడ్డూ, అదుపు ఉండదు. చాలావరకూ సినిమా హీరోలు, హీరోయిన్లు వీటి గురించి పెద్దగా పట్టించుకోరు. ఎవరి సినిమాల్లో వాళ్లు బిజీగా ఉంటే, జనాలు మాత్రం వాళ్ల



పెళ్లిళ్లు, హనీమూన్‌లు, వారి బిడ్డల నామకరణాలతో ఊపిరి సలపని అప్‌డేట్స్‌తో బిజీగా ఉంటున్నారు. ఓ రకంగా తమ సరదా తీర్చుకోవడం తప్ప నిజానిజాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. గత కొన్నేళ్లుగా ఇవీ శ్రుతి మించిపోతున్నాయి. అందుకే పలువురు తారలు గట్టిగానే బదులిస్తున్నారు. పెళ్లికాని అగ్ర కథానాయికల్లో త్రిష ఒకరు. దీంతో త్రిష పెళ్లి ఎప్పుడూ హాట్ టాపికే. ఈ క్రమంలో ఇటీవల ఆమె పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో త్రిష కాస్త ఘాటుగానే స్పందించారు. 'నాకోసం నా జీవితాన్ని ప్లాన్ చేస్తున్న వాళ్లను నేను ప్రేమిస్తా. హనీమూన్ షెడ్యూల్ కూడా చెబుతారేమోనని వేచి చూస్తున్నా' అంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. ఇక పెళ్లయిన హీరోయిన్ గురించి అయితే, ఆమె గర్భిణి అంటూ పోస్టులు పెట్టి, నానా హంగామా సృష్టిస్తుంటారు. ఇలాంటి వ్యాఖ్యలే మరోసారి ఆమె చెవిన పడటంతో సోనాక్షి తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. 16నెలలకు పైగా గర్భిణిగా ఉండటం వరల్డ్ రికార్డు ఉదర భాగంపై చెయ్యి వేసి ఫొటో దిగినందుకు ఇలాంటి వదంతులు సృష్టించారు. వాటికి మా సమాధానం ఇదే' అంటూ ఈ ఫొటోను పంచుకున్నారు. తెలుగు హీరోయిన్ అంజలిది అదే పరిస్థితి. 'నాకు తెలియకుండానే ఇప్పటికి నాలుగుసార్లు పెళ్లి చేశారు. ఇప్పుడు ఐదోసారి చేస్తున్నారు. నేను కూడా సోషల్ మీడియాలో దీని గురించి విన్నాను. నేను పెళ్లి చేసుకొని వేరే ఇంట్లో ఉంటున్నట్లు రాశారు. వాళ్లకు తెలియని విషమేమిటంటే నేను అవుట్ డోర్ షూటింగ్స్‌లోనే ఎక్కువగా ఉంటున్నా. ఆ వార్తకు, నాకు ఎలాంటి సంబంధం లేదు. అది ఫేక్ న్యూస్. పెళ్ళైతే చేసుకుంటా.. కానీ ఇప్పుడు కాదు. దానికి కొంచెం టైమ్ ఉంది' అంటూ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇదే పరిస్థితి మృణాళ్ ఠాకూర్ ఎదుర్కొన్నట్లు తెలిపింది. 'నా స్నేహితులు, స్టైలిస్ట్ డిజైనర్లు, బంధువులు వరుసగా ఫోన్‌కాల్స్ చేసి తెలుగు అబ్బాయిని పెళ్లి చేసుకుంటు న్నావా? అని



అడుగుతున్నారు. ఆ అబ్బాయి ఎవరో నాకూ తెలుసు కోవాలని ఉంది. ఈ ఫన్నీ రూమర్ గురించి ఏం మాట్లా డాలో కూడా తెలియట్లేదు. త్వరలోనే పెళ్లవుతుంది. అయితే వరుడిని మీరే వెతికిపెట్టి నాకు చెప్పండి. కల్యాణ వేదిక, ఆ లోకేషన్ వివరాలు కూడా పంపండి. సరేనా? అని వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. ఇక ఈ జాబితాలో తమన్నా, శ్రుతిహాసన్, అనుపమ పరమేశ్వ రన్, సాయిపల్లవి చాలామంది హీరోయిన్స్ ఉన్నారు. 'మాకు పెళ్లి కుదిరితే, మేమే చెబుతాం' అంటూ వాళ్లు మొత్తుకున్న సందర్భాలెన్నో. తెలుగు అగ్ర కథానాయకుడు ప్రభాస్, కథానాయిక అనుష్కలకు అయితే, సోషల్ మీడియా ఎన్నిసార్లు పెళ్లి చేసిందో లెక్కేలేదు.









## మళ్లీ అవకాశాలు అంగీకరిస్తున్నా..

### - నటి రేణూదేశాయ్ వెల్లడి

ఒకప్పుడు కథానాయికగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన రేణూ దేశాయ్ దాదాపు 20 ఏళ్ల తర్వాత రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు'లో కనిపించిన సంగతి తెలిసిందే. సంఘ సంస్కర్త హేమలతా లవణం పాత్రని పోషించారు. అయితే, ఆ సినిమా సమయంలో తనపై కొన్ని విమర్శలు వచ్చాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ ట్రోల్ చేసినవారు ఎవరూ తర్వాత తనకు క్షమాపణలు చెప్పలేదన్నారు. 'నేను 'టైగర్ నాగేశ్వరరావు' చేసిన సమయంలో నాపై విమర్శలు వచ్చాయి. కమ్‌బ్యాక్ ఇచ్చింది.. ఇక ఎక్కడ చూసినా కనిపిస్తుంది. ఎలాంటి సినిమాల్లోనైనా నటిస్తుందని రాశారు. ఇప్పుడు ఆ సినిమా వచ్చి రెండేళ్లు అవుతోంది. ఇప్పటివరకూ నేను మళ్లీ స్క్రీన్‌పై కనిపించలేదు. ఏ సినిమాకు సైన్ చేయలేదు. నేను సినిమాలు అంగీకరించలేదని నా గురించి అలా మాట్లాడిన వాళ్లు ఇప్పుడు వచ్చి క్షమాపణలు చెప్పరు. మాట్లాడేవారు ఎలాగైనా మాట్లాడ తారంతే. నాకు నటన అంటే చాలా ఇష్టం. కానీ, అదే నా లక్ష్యం కాదు. 15 ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీకి వచ్చాను. నేను డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చే మనిషిలా కనిపిస్తాను. డబ్బును జాగ్రత్తగా ఖర్చు చేస్తాను.. కానీ, దానికి ప్రాధాన్యం ఇవ్వను.

ఒకవేళ నేను అప్పటినుంచి ఇప్పటి వరకూ సినిమాలు చేస్తూ ఉన్నట్లైతే ఇప్పటికి చాలా మంచి పేరు వచ్చేదని రేణు చెప్పారు. తనకు ఇప్పుడు గొప్ప పాత్రలు వస్తున్నాయన్నారు. మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాల్లో ఛాన్స్‌లు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అత్తగారి పాత్రకు ఓకే చేసినట్లు చెప్పారు. త్వరలోనే ఆ సినిమా ప్రారంభం కానుందన్నారు. అత్తాకోడళ్లకు సంబంధించిన కామెడీ చిత్రంగా అది రానున్నట్లు వెల్లడించారు. తనకు ఆధ్యాత్మిక మార్గం అంటే ఇష్టమని.. భవిష్యత్తులో సన్యాసం తీసుకునే అవకాశం ఉందని రేణూ దేశాయ్ చెప్పారు.

## పోస్ట్‌తో ఫుల్‌స్టాప్ పెట్టిన సుజీత్

బాక్సాఫీసు వద్ద సందడి చేసిన 'ఓజీ' సినిమా ఓటీటీ నెట్‌ప్లిక్స్‌లో ఈ నెల 23 నుంచి స్ట్రీమింగ్ కానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. దర్శకుడు సుజీత్ సోషల్ మీడియాలో మంగళవారం పోస్టు చేసిన ఓ నోట్ వైరల్‌గా మారింది. 'ఓజీ' విషయంలో తనను నమ్మి, ఎంతగానో సపోర్ట్ చేశారంటూ నిర్మాత డీవీవీ దానయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఓజీ' గురించి చాలామంది ఏదేదో మాట్లాడుతున్నారు. కానీ, సిని మాని ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ ఏం అవసరమనేది కొందరు మాత్రమే అర్థం



చేసుకుంటారు. నా నిర్మాత, టీమ్ ఇచ్చిన మద్దతు గురించి మాటల్లో చెప్పలేనని పేర్కొన్నారు. సుజీత్ సడెన్‌గా ఈ పోస్టు పెట్టడంపై నెట్టింట చర్చ జరుగుతోంది.

## రాజ్ నిడుమోరుతో సమంత దీపావళి

నటి సమంత, బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు డేటింగ్‌లో ఉన్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఆ వార్తలకు మరింత ప్రాధాన్యం చేకూర్చేలా తాజాగా రాజ్‌తో కలిసి సమంత దీపావళిని సెలబ్రేట్ చేసుకున్నారు. రాజ్ నిడిమోరు కుటుంబంతో కలిసి ఆమె దిగిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. బాణసంచా కాలుస్తోన్న



ఫొటోలను షేర్ చేసిన సామ్.. 'నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది' అని క్యాప్షన్ పెట్టారు. తరచూ వీరిద్దరూ కలిసి కనిపిస్తుండడంతో ఆ ఫొటోలు నెటిజన్‌లను ఆకర్షిస్తున్నాయి. రాజ్-డీకే సంయుక్తంగా తెరకెక్కించిన 'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 2', 'సిటడెల్: హనీ బన్నీ'లో సమంత నటించారు. ఆ సమయంలోనే రాజ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న ప్పటికీ.. అధికారికంగా ఎక్కడా స్పందించలేదు. ఇక సిని మాల విషయానికొస్తే.. ఎన్నో రోజులుగా ఆమె అభిమానులు ఎదురుచూస్తోన్న 'మా ఇంటి బంగారం' త్వరలోనే ప్రారంభం కానుంది. దీనికి నందినిరెడ్డి దర్శకత్వం వహించనున్నారని సమాచారం. దీనితో పాటు 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' ప్రాజెక్టులో సమంత ప్రస్తుతం నటిస్తున్నారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154